ఏలూరు ఉష్ణోగ్రతలు

గరిష్ఠం : 31.0

కనిష్ఠం : 23.0



చూడిదే... శ్రీనివాసుడే

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. మంగళవారం మలయప్ప అలంకరణలో శ్రీవారు దర్శన మిచ్చారు. కనుల పండువగా అష్టదళ పాదపద్మారాధన జరిగింది.

బ్రహ్మోత్సవాలలో భాగంగా గరుడ వాహనంపై వాడపల్లి వేంకటేశ్వరస్వామిని తీసుకొస్తున్న ఎమ్మెల్యే సత్యానంద రావు తదితరులు.

గుబ్బల మంగమ్మ ఆలయం వద్ద ప్లాస్టిక్ నిషేధం

బుట్టాయగూడెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గుబ్బల మంగమ్మతల్లి ఆలయం వద్ద పర్యావరణ పరిరక్షణలో భాగంగా అధికారుల ఆదేశాల మేరకు ప్లాస్టిక్ కవర్లను పూర్తిగా నిషేధించినట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులు మొక్కుబడులు చెల్లించి బంధువులకు విందు విస్తారు. భోజనాలు చేసిన ప్లేట్లను, గ్లాసులను ఎక్కడపడితే అక్కడ పడవేయడంతో అమ్మవారి ఆలయ ప్రాంగణం ప్లాస్టిక్ వస్తువులతో నిండిపోతోంది. పక్కనే చెత్త కుండీలు ఉన్నా భక్తులు ప్లేట్లను, గ్లాసులను వేయడం లేదు. ఆలయ పరిసరాల్లో ఆలయ కమిటీవారు ప్రతి రోజు కూలీలతో శుభ్రం చేయిస్తున్నారు. అటవీ చట్టాల ప్రకారం ప్లాస్టిక్ వస్తువులు అడవిలో నిషేధం. భక్తులు అటవీశాఖ తెలిపిన బయో కవర్స్‌ను మాత్రమే వాడి పర్యావరణాన్ని కాపాడాలని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తప్పవని హెచ్చరించారు.



అమ్మవారి ఆలయం వద్ద ప్లాస్టిక్ కవర్లను ఏరి ట్రక్కులో తరలిస్తున్న కూలీలు

17 ఏళ్లలోపు వారికి..

ఆధార్ నవీకరణ ఉచితం

- ప్రచారం శూన్యం ..

అరకొర కేంద్రాలతో సరి

(ఏలూరు-ఆంధ్రజ్యోతి)



నూతనంగా ఆధార్ కార్డులు పొందే వారికి శుభవార్త. కొత్తకార్డు పొందాలంటే రూ.100 వరకు ఫీజు కింద కట్టించుకునే వారు. ఇప్పుడు దాన్ని మినహాయించారు. దీంతోపాటు ఐదేళ్ల నుంచి 17 ఏళ్ల లోపు ఉన్న వారు బయోమెట్రిక్ అప్‌డేట్ ఉచితంగా చేసుకోవచ్చు. ఇది ఒక్కసారికే వర్తిస్తుంది. చిన్న పిల్లలకు బాల ఆధార్ నమోదుకు ప్రతీ మండలంలో నాలుగు చొప్పున బాల ఆధార్ కేంద్రాలను అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ నెల ఒకటో తేదీ నుంచి ఉడాయ్ ఆధార్ చార్జీలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో తప్పులు దొర్లి ఉంటే, ఇతర చేర్పులకు డెమోగ్రాఫిక్ (పేరు, పుట్టిన తేదీ) నమోదుకు రూ.50 ఉండగా, ప్రస్తుతం రూ.75కు పెంచారు. సాధారణ బయోమెట్రిక్ రూ.100 నుంచి రూ.125కు డాక్యుమెంట్ నవీకరణకు రూ.50 నుంచి రూ.75కు పెంచారు.

అప్‌డేట్ చేయించుకపోతే..

ఆధార్ బయోమెట్రిక్ అప్‌డేట్ చేయించుకోకపోవడంతో విద్యార్థి దశలో పలు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. సంక్షేమ పథకాలకు అర్హత కోల్పోతున్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని యూఐడీఏఐ ఒక పక్క రూ.25 చొప్పున చార్జీ పెంచినప్పటికీ కొన్ని సేవలను ఉచితంగా అందిస్తోంది. పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నా, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాల్లో లబ్ధి పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలన్నా ఆధార్ కార్డు తప్పనిసరి. తల్లికి వందనం, ఫీజు రీయంబర్స్‌మెంట్‌కు ఆధారే ప్రామాణికం. గతంలో పెద్ద ఎత్తున ఆధార్ నమోదు కేంద్రాలుండేవి. అవి ఎత్తేయడంతో ఇప్పుడు ప్రస్తుతం బ్యాంకులు, తపాలా కార్యాలయాలతో సహా, ఎంపిక చేసిన గ్రామ సచివాలయాల్లోను ఆధార్ నమోదు కేంద్రాల ద్వారా సేవలు అందుబాటులోకి వచ్చాయి.

పోస్టల్‌శాఖ కొంత మెరుగు...

జిల్లాలో ఆధార్ నవీకరణ, ఇతర మార్పులు, చేర్పులు విషయంలో పోస్టల్ శాఖ ఇటీవల కాలంలో పల స్కూళ్లలో అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది. అయితే ఏలూరు కేంద్రంగా ఏలూరు హెడ్‌పోస్టాఫీస్, వెంకట్రావుపేట, ఆర్ఆర్ పేట కేంద్రాల్లో అధార్ శాశ్వత కేంద్రాలుగా నడిచేవి. సాంకేతిక కారణాలతో వెంకట్రావుపేట, ఆర్ఆర్‌పేట కేంద్రాల్లో ఆధార్ సేవలను అందివ్వడం లేదు. ఏలూరు హెడ్‌పోస్టాఫీస్ కేంద్రంగా రోజుకు 50 వరకు ఆధార్ (మిగతా 8వ పేజీలో)

పీ-4 దారెటో?

పేదరికం లేని సమాజమే లక్ష్యంగా పీ- 4 కార్యక్రమానికి సీఎం చంద్రబాబు ఈ ఏడాది ఏప్రిల్ 11న ఆగిరిపల్లిలో ఎంతో ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టారు. జిల్లా అంతా బంగారు కుటుంబాలు ఎంపిక చేసి రెండు నెలలవుతోంది. అయితే ఆచరణలో పేదలకు ఉపాధి, ఉద్యోగ, ఇతర శిక్షణ కార్యక్రమాలకు ఇంకా అంకురార్పణ జరగలేదు. దీంతో అనుకున్న లక్ష్యాలకు ఎప్పుడు చేరతారో అన్నది ప్రశ్నగా మారింది.

(ఏలూరు- ఆంధ్రజ్యోతి)

- బంగారు కుటుంబాలకు సాంత్వన ఎన్నడో..
- 71,876 కుటుంబాల దత్తతకు..6,296 దాతలు ముందుకు..
- ఇప్పటి వరకు దత్తత తీసుకున్నది 31,608 మందిని మాత్రమే
- వసతులు, ఉపాధి కల్పనపై బంగారు కుటుంబాల ఆశలు

జిల్లాలో పేదరికం లేని సమాజ నిర్మాణం కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం దత్తత తీసుకోవడం దగ్గరే నిలిచిపోయింది. విద్యావైద్యం, ఉపాధి, ఉద్యోగాలు, ఇతర ఉపాధి శిక్షణలతో ప్రతీ పేద కుటుంబం అభ్యున్నతి సాధించాలన్న సంకల్పంతో సీఎం చంద్రబాబు నాయుడు ఈ కార్యక్రమానికి రూపకల్పన చేశారు. దాతల చేయూత కోసం జిల్లాలోని బంగారు కుటుంబాలు ఎదురుచూస్తున్నాయి. నూజివీడు మండలం ఆగిరిపల్లిలో ఏప్రిల్ 11న ఈ బంగారు కుటుంబాలతో, వ్యాపారవేత్తలతో సీఎం ముఖాముఖి నిర్వహించారు. ఇందులో వేదికపైనే 60 కుటుంబాలను దత్తత తీసుకోవడానికి ఆరుగురు పారిశ్రామికవేత్తలు ముందుకొచ్చారు. తదనంతరం నియోజకవర్గాల వారీగా బంగారు కుటుంబాల ఎంపికలకు జిల్లా వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి అర్హులను ఎంపిక చేశారు. ఈ ప్రక్రియను ఆగస్టు 15వ తేదీ నాటికి డేటా ఎంట్రీ, బంగారు కుటుంబాలు లెక్కలను తేల్చడంతో పాటు మార్గదర్శకులను ఖరారు చేశారు.

ఊరట ఎన్నడో ?

జిల్లాలో 605 వార్డు సెక్రటరీల పరిధిలో మొత్తం 598 పరిసర ప్రాంతాలను కలుపుతూ ఎంపిక చేపట్టారు. ఇందులో 27 మండలాలు, ఏలూరు కార్పొరేషన్, నూజివీడు, జంగారెడ్డిగూడెం మునిసిపాలిటీలతో పాటు చింతలపూడి నగర పంచాయతీని కలిపి మొత్తం 71,876 కుటుంబాల్లో లక్షా90,623 మంది సభ్యులను లెక్కగట్టారు. ఇందులో కేవలం 31,608 మందిని మాత్రమే 6,296 మంది దత్తత స్వీకరణకు అంగీకరించారని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. ఇంకా లక్షా అరవైవేల మందికి పైబడి దత్తత స్వీకరణకు మార్గదర్శకులను ఒప్పించాల్సి ఉంది.

నిర్బంధం కాదు.. స్వచ్ఛందంగానే ..

పేదలను ఆదుకునే క్రమంలో వ్యాపారవేత్తలు, ఇతర స్వచ్ఛంద సంస్థలను ఈ కార్యక్రమంలో స్వచ్ఛందంగానే భాగ స్వామ్యులను చేయాలని ప్రభుత్వం స్పష్టంగానే ఆదేశించింది. ఆ క్రమంలోనే పేదలను ఆదుకునేందుకు కొన్ని ప్రభుత్వ శాఖలు రంగంలోకి దిగి తమ,తమ శాఖల ద్వారా ప్రయోజన పొందేవారిని, బంగారు కుటుంబాలను దత్తత తీసుకోవడానికి మార్గదర్శకులుగా ఎంపిక చేసింది. తీరా ఆచరణలో వ్యాపారవేత్తలు పేద కుటుంబాలను ఆదుకునే చర్యలు ప్రారంభించకపోవడం విమర్శలకు తావిస్తోంది.

ఆగిరిపల్లిలో డ్రైవింగ్ శిక్షణతోనే సరి

నూజివీడు 60 కుటుంబాలను పారిశ్రామిక వేత్తలు ఆరుగురు దత్తత తీసుకోవడానికి ముందుకు రాగా.. ఇందులో మంత్రి కొలుసు పార్థసారథి కుమారుడు నితిన్ కృష్ణ కొంతమంది ట్రైసైకిళ్లను అందజేశారు. ఆగిరిపల్లిలోనే నూజివీడు సీడ్స్ దత్తత తీసుకుని బ్యాచ్‌కు 30 మందికి డ్రైవింగ్ స్కిల్స్ ట్రైనింగ్ ప్రారంభించారు. వరుణ్ మోటార్స్ ద్వారా నెల రోజులు శిక్షణ ఇప్పిస్తున్నారు. మొత్తం 90 మంది శిక్షణ పూర్తి చేయించి వారికి 10 శాతం లోన్ మొత్తంలో ఈ సంస్థ సహకారం అందించనుంది. 90 శాతం రుణంతో కార్లు కొనుగోలు చేయించడానికి కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నారు.



ఆగిరపల్లిలో ఎంపికైన బంగారు కుటుంబంతో సీఎం చంద్రబాబు (ఫైల్)

ఎమ్మెల్యేల భాగస్వామం ఉంటే..

పేద కుటుంబాలకు స్థానికంగా ఉపాధి మార్గాలను కల్పించే విషయంలో స్థానిక ఎమ్మెల్యేలను ఈ పీ-4 కార్యక్రమంలో ప్రభుత్వం భాగస్వామ్యం చేసి.. క్షేత్రస్థాయిలో ఏమీ జరుగుతుందో పరిశీలన చేయిస్తే అనుకున్న లక్ష్యాలు నెరవేరే అవకాశం ఉందన్న వ్యాఖ్యలు విన్పిస్తున్నాయి. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటే పీ-4 లక్ష్యం మరింతగా నెరవేరుతుందని పలువురు సూచిస్తున్నారు.

బ్యాంకులో మంటలు..

వేగంగా స్పందించిన ఏలూరు ఫైర్ సిబ్బంది

ఆర్టీసీ బంకులో విజిలెన్స్ విచారణ

బిల్లుల మాయాజాలంతో రూ.78 లక్షలు గోల్‌మాల్

నిధుల దుర్వినియోగం కేసులో రిటైర్డ్ కార్యదర్శి అరెస్టు

■ లోపలి పేజీలో..

హమ్మయ్య..

- తీరిన ఉపాధ్యాయుల కొరత
- కుక్కునూరు మండలంలో 96 పోస్టులు భర్తీ

కుక్కునూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల చదువులు ఇక నుంచి సక్రమంగా సాగనున్నాయి. ఇటీవల డీఎస్సీ ద్వారా మండలంలో కొత్తగా 96 ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయి. వేసవిలో మండలం నుంచి దాదాపు 60 మంది ఉపాధ్యాయులు బదిలీపై వెళ్లిపోయారు. దీంతో ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల్లేక చదువులు సాగని పరిస్థితి ఏర్పడింది. చాలా పాఠశాలల్లో 60-90 మంది విద్యార్థులకు కేవలం ఒక ఉపాధ్యాయుడే పాఠాలు చెప్పే పరిస్థితి ఏర్పడింది. ఉపాధ్యాయుల కొరతపై 'ఆంధ్రజ్యోతి'లో పలు కథనాలు వెలువడ్డాయి. ఎట్టకేలకు ప్రాథమికోన్నత పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్లు 11, ఎంఈవో పరిధిలో ఎస్జీటీ పోస్టులు 66, హైస్కూల్ పరిధిలో స్కూల్ అసిస్టెంటు పోస్టులు 15, ట్రైబల్ వెల్ఫేర్‌లో నాలుగు ఉపాధ్యాయ పోస్టులు భర్తీ అయ్యాయి. మోడల్ స్కూల్‌లో ప్రతీ తరగతికి ఒక ఉపాధ్యాయుడు చొప్పున 6 నుంచి 9 పోస్టులు భర్తీ అయ్యాయి. ఇక నుంచి పూర్తిస్థాయిలో విద్యాబోధన జరగనుందని తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యమైన మద్యం కోసం ఎక్సైజ్ సురక్ష యాప్

ఏలూరు,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): వినియోగదారులకు నాణ్యమైన మద్యాన్ని సరఫరా చేయడానికి, మద్యం నాణ్యత వినియోగదారుడు పరిశీలించి కొనుగోలు చేయడానికి 'ఏపీ ఎక్సైజ్ సురక్ష అనే యాప్‌ను అందుబాటులోకి ప్రభుత్వం తీసుకొచ్చిందని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ బి.శ్రీలత, జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఆవాల ఆవులయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి ఏపీ ఎక్సైజ్ సురక్ష యాప్‌ను గూగుల్ ప్లే స్టోర్ నుంచి డౌలోడ్ చేసుకుని మద్యం నాణ్యతను పరిశీలించి కొనుగోలు చేయాలని వారు కోరారు. ఏదైనా తేడాలు గుర్తించిన వెంటనే 14405 టోల్‌ఫ్రీ నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఈ యాప్ ద్వారా ప్రతీ బాటిల్‌ను స్కాన్ చేసి లైసెన్సుడ్ ప్రెమిసెస్‌లో మాత్రమే అమ్మాలని మద్యం షాపు లైసెన్సీ దారులకు విజ్ఞప్తి చేశారు.



వెంకటాపురం తమ్మిలేరులో కొట్టుపోయిన చెక్‌డ్యామ్

ఇంకెన్నాళ్లు!

- వరదలకు కొట్టుకుపోయిన వెంకటాపురం చెక్‌డ్యామ్
- పట్టించుకోని గత వైసీపీ ప్రభుత్వం
- టీడీపీ ప్రభుత్వం వచ్చాక ప్రతిపాదనలు
- ఎనిమిది నెలలైనా మంజూరు కాని నిధులు

ముసునూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): తమ్మిలేరుపై ముసునూరు మండలం వెంకటాపురం వద్ద నిర్మించిన చెక్‌డ్యామ్ వరదలకు కొట్టుకుపోయినా దీనిని పట్టించుకునే నాథుడే కరువయ్యారు. 2009లో నాటి ప్రభుత్వం రూ.6 కోట్ల వ్యయంతో ఈ చెక్‌డ్యామ్‌ను నిర్మించగా 2020లో వచ్చిన వరదలకు కొట్టుకు పోయింది. అప్పటి వైసీపీ ప్రభుత్వం ఈ చెక్‌డ్యామ్ వైపు కన్నెత్తి చూడలేదు. నాటి నుంచి పంటలకు సకాలంలో నీరు అందక రైతులకు తీవ్ర నష్టం జరిగింది. ఈ చెక్‌డ్యామ్ వల్ల బలివే, , వెంకటాపురం (మిగతా 8వ పేజీలో)



చెక్‌డ్యామ్‌ని పరిశీలిస్తున్న ఇరిగేషన్ అధికారులు (ఫైల్)

బీడు భూములుగా పొలాలు



వేల్పుచర్లలోని ఏడు చెరువులకు ఈ చెక్‌డ్యామ్ నుంచి సప్లైయి ఛానల్ ద్వారా చేరిన నీటితో పంటలు పండేవి. ఈ చెక్‌డ్యామ్ కొట్టుపోయిన నాటి నుంచి నీరు లేక సుమారు 700 ఎకరాలు పంట పొలాలు బీడు భూములుగా మారాయి. ప్రభుత్వం చెక్‌డ్యామ్ నిర్మాణానికి చర్యలు చేపట్టి రైతులకు మేలు చేయాలి.

- తుమ్మల నాగేశ్వరరావు, ఏటికాలువ నీటి సంఘం అధ్యక్షుడు, వేల్పుచర్ల.

రూ 3.5 కోట్లతో ప్రతిపాదనలు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే మంత్రి పార్థసారథి ఆదేశాలతో కొట్టుకుపోయిన చెక్‌డ్యామ్‌ను పరిశీలించాం. దీని నిర్మాణా నికి సుమారు రూ.3.50 కోట్లు నిధులు అవసరమని ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు కాగానే పనులు చేపడతాం.

- వై.అర్జునరావు, ఇరిగేషన్ డీఈ, నూజివీడు

గత ప్రభుత్వ నిర్లక్ష్యం..



వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే వరదలకు చెక్‌డ్యామ్ కొట్టుపోయింది. ఐదేళ్ల నిర్లక్ష్య పాలన రైతుల పాలిట శాపంగా మారింది. ఈ చెక్‌డ్యామ్ నుంచి బలివే గ్రామంలో ఉన్న రెండు చెరువులకు నీరు చేరేది. సుమారు 700 ఎకరాల్లో పంటలు పుష్కలంగా పండేవి. ప్రస్తుతం నీరు లేక వర్షాలపై అధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. టీడీపీ ప్రభుత్వం రైతుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చెక్‌డ్యామ్ నిర్మాణాన్ని చేపట్టాలి.

- కాట్రు రామస్వామి, రైతు, బలివే



మాదేపల్లిలో నీట మునిగిన పంట పొలాలు

వర్షాలకు నీట మునిగిన వరి పొలాలు

ఏలూరు రూరల్, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి): మండలంలో కురిసిన భారీ వర్షానికి నాట్లు వేసిన వేల ఎకరాల వరి పొలాలు చెరువులుగా మారాయి. గురకల పేట శివారులో ఉన్న సుమారు 300 ఎకరాల వరిపొలాలు నీటి మునిగాయి. ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో దిగువకు వెళ్ళే మార్గం లేకపోవడంతో పంట ముంపు బారిన పడింది. వరి దుబ్బు ఏర్పడే సమయంలో ఇలా పంట నీటిలో మునిగి పోవడంతో అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు. ఏటా పంట పొలాలు ముంపు బారిన పడుతున్నాయని, దిగువకు నీరు తమ్మిలేరులోకి వెళ్ళకపోవడంతో ఈ సమస్య తలెత్తుతోందని రైతులు వాపోతున్నారు. పంట కాలువలు పూడికలు తీయకపోవడంతో వర్షపునీరు పంటలను ముంచేస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

స్వల్పంగా పెరిగిన గోదావరి నీటిమట్టం

పోలవరం అక్టోబరు14(ఆంధ్రజ్యోతి):పోలవరంలో గోదావరి నీటిమట్టం మంగళ వారం సాయంత్రానికి స్వల్పంగా పెరిగింది. ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 3,50,309 క్యూసెక్కుల జలాలను జలవనరులశాఖ అధికారులు స్పిల్‌వే నుంచి దిగువకు విడుదల చేశారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 29.150 మీటర్లు, స్పిల్‌వే దిగువన 19.500 మీటర్లు నమోదయ్యింది. భద్రాచలం వద్ద 21.60 అడుగుల నీటిమట్టం నమోద య్యింది.

ఆడపిల్లల పట్ల వివక్ష విడనాడాలి : డీఎంహెచ్‌వో



ఏలూరు రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరూ ఆడపిల్లల పట్ల వివక్ష విడనాడాలని జిల్లా వైద్యాధికారిని పీజే అమృతం అన్నారు. చాటపర్రు జిల్లా పరిషత్ హైస్కూల్‌లో మంగళవారం చాటపర్రు పీహెచ్‌సీ వైద్యులు కె.ప్రదీప్ చంద్ర, డాక్టర్ జి.కృష్ణ ఆధ్వర్యంలో జాతీయ బాలిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎంహెచ్‌వో విచ్చేసి మాట్లాడుతూ వారిని ప్రోత్సహిస్తే ఎన్నో అద్భుతాలు చేసి చూపిస్తారన్నారు. అంతర్జాతీయ స్థాయికి ఎదిగిన పలువురి జీవితాలను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాసరావు, పీహెచ్‌సీ సిబ్బంది రామాంజనేయులు, ఆయేషా, సంధ్యారాణి, పాఠశాల ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



పరిశ్రమల అధికారుల సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ వెట్రిసెల్వి, జేసీ అభిషేక్ గౌడ

ఫ్యాక్టరీల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలి : కలెక్టర్

ఏలూరు,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రతీ ఫ్యాక్టరీకి తప్పనిసరిగా భద్రతా ప్రమాణాలు పాటించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.. ప్రతీ ఫ్యాక్టరీకి తప్పనిసరిగా భద్రతా అధికారిని నియమించాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జిల్లా స్థాయి పారిశ్రామిక భద్రతా కమిటీ సమావేశం, క్రైసిస్ గ్రూపుల కమిటీ సమావేశంలో ఆమె సమీక్షించారు. భద్రతా చర్యలపై ప్రతీ ఫ్యాక్టరీ 30 రోజుల్లో పూర్తి నివేదికలను సమర్పించాలన్నారు. జిల్లాలో పరిశ్రమల ఎగుమతులు ప్రోత్సాహక కమిటీ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఫుడ్‌ప్రాసెసింగ్ యూనిట్లు 200 మంజూరు చేశామని, వాటిల్లో రాబోయే సమావేశానికి 100 యూనిట్లు తగ్గకుండా ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు. జేసీ కలెక్టర్ అభిషేక్ గౌడ, డీఆర్వో విశ్వేశ్వరరావు, ఐటీడీఏ పీఈ రాములు, జిల్లా పరిశ్రమల కేంద్రం జీఎం సుబ్రహ్మణ్యేశ్వరరావు, జిల్లా పరిశ్రమల తనిఖీ అధికారి కె.,కృష్ణమూర్తి పాల్గొన్నారు.

● కలెక్టరేట్ ప్రాంగణంలోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల (ఈవీఎం) గొడౌన్‌ను కలెక్టర్ కె.వెట్రిసెల్వి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. డీఆర్వో విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

● **ఏలూరు క్రైం** : జిల్లాలో ఎనిమిది ప్రదేశాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాలకు సంబంధించి భూసేకరణ పనులు వేగవంతం చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి అధికారులను ఆదేశించారు. జిల్లాలో నిర్మించనున్న రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాలకు సంబంధించి భూసేకరణపై అధికారులతో మంగళవారం కలెక్టరేట్ నుంచి సంబంధిత అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్సు ద్వారా సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏలూరులోని పవర్‌పేట గేటు వద్ద, దెందులూరు మండలంలోని సీతంపేట, శ్రీరామవరం, జాతీయ రహదారిని అనుకుని భీమడోలు రైల్వేగేట్టు, పూళ్ళ, కైకరం, చేబ్రోలు, ఉంగుటూరు స్టేషన్ వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి, రైల్వే అండర్ బ్రిడ్జిల నిర్మాణానికి సంబంధించి భూసేకరణ నిర్దేశించిన సమయంలోగా పూర్తి చేయాల న్నారు.

● **ఏలూరుసిటీ** : జిల్లాలో ఈ-పంట, ఈకేవైసీ నూరుశాతం పనులు త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ వెట్రిసెల్వి వ్యవసాయాధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి మంగళవారం సాయంత్రం ఈ-పంట, ఈకేవైసీలపై వ్యవసాయ శాఖాధికారులు, సిబ్బందితో కలెక్టర్ టెలీకాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జిల్లాలో 4.92 లక్షల ఎకరాలకు సంబంధించి ఈ-పంట నమోదు చేయాల్సి ఉండగా 96.6 శాతం అంటే 4.77 లక్షల ఎకరాల్లో పూర్తి చేసి, రాష్ట్రంలో రెండో స్థానంలో నిలిచామన్నారు. ఈకేవైసీ కూడా వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖాధికారి షేక్ హబీబ్‌బాషా, వ్యవసాయ శాఖ ఏడీలు, మండల వ్యవసాయ శాఖాధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

దేవాదిదేవా..శ్రీవాసుదేవా

వాడపల్లిలో ఘనంగా వార్షిక బ్రహ్మోత్సవాలు

గరుడవాహనంపై ఊరేగిన వేంకటేశ్వరస్వామి

ఆత్రేయపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆత్రేయపురం మండలం వాడపల్లిలో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి 13వ వార్షిక బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఐదో రోజైన మంగళవారం ఆలయంలోని వసంత మండపంలో ఉత్సవమూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, సప్త కలశారాధన, మహాస్నపనం, వసంతోత్సవాలను వేదపండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు-కమలారాణి దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారి పాదాల చెంత 108 బంగారు పుష్పాలతో అష్టదళ పాదపద్మారాధనను కనుల పండువగా నిర్వహించారు. రాత్రి మలయప్ప అలంకరణలో శ్రీవారు గరుడ వాహనంపై తిరువీధుల్లో విహరించారు. ఎమ్మెల్యే డ్రమ్స్ కొట్టి ఉత్సాహపరిచారు. మహిళల కోలాటం, నాగపూర్‌కు చెందిన బ్యాండ్ వాయిద్యాలు, ఉత్తరప్రదేశ్ కాశీకి చెందిన అఘోరాల విన్యాసాలు, తెలంగాణకు చెందిన బోనాలు, శక్తివేషాలు అలరించాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు విచ్చేశారు



ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన

కొల్లేరుకు విదేశీ అతిథులు

వలస పక్షుల రాకతో సందడి

కైకలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం ఇంటికి బంధువులు వచ్చినట్లుగానే ఈ సంవత్సరం కొల్లేరుకు విదేశీ అతిథులు రాక ప్రారంభమైంది. ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడడంతో కొల్లేరు సరస్సు నిండుకుండలా మారింది. పక్షులకు స్వర్గధామంగా మారింది. నీటితో పాటు విదేశీ పక్షులకు సమృద్ధిగా ఆహారం లభిస్తుంది. ఇప్పటికే విదేశాల నుంచి పక్షులు వచ్చి సంతానోత్పత్తికి గూళ్ల నిర్మాణం ప్రారంభించాయి. మంచినీటి సరస్సుగా పేరొందిన కొల్లేరుకు ప్రతి సంవత్సరం వివిధ జాతులకు చెందిన పక్షులు వేల కిలోమీటర్లు ప్రయాణించి చేరుతూంటాయి. 77,136 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సు అనేక జీవ జాతులకు ఆలవాలం. కెనడా, సైబీరియా, ఆస్ట్రేలియా తీరప్రాంతాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి వలసవచ్చిన వివిధరకాల పక్షులు కొల్లేరు శీతాకాలపు అతిథులుగా పర్యాటకులను ఆకర్షిస్తాయి. ఇప్పటికే వేలాది పక్షులు తరలిరావడంతో ఆటపాక పక్షుల కేంద్రం పక్షుల కిలకిల రావాలతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కొల్లేరు సరస్సులో చేపలను వేటాడి ఆహారాన్ని సంపాదిస్తున్న తీరు అబ్బురపరుస్తుంది. ఆడ,మగ పక్షులు జతకట్టి సమీప ప్రాంతాల నుంచి పుల్లలు ఎరుకుని గూళ్లు కట్టుకుంటున్నాయి. పెయింటెడ్ స్టార్క్, ఫెలికాన్‌తో పాటు ఎర్రకాళ్ళ ఉలసలు, తెల్ల, నల్ల కంకణాల పిట్టలు, జనకబాతులు, నీటికోళ్ళు, ఊది చెంచుకోడి, పెద్ద ఉల్లంకి పక్షులు సంతానోత్పత్తి చేసుకునేందుకు కొల్లేరు సరస్సు అనువైన ప్రదేశం. ఇప్పటికే పక్షులు వలస వచ్చి సంతానోత్పత్తి చేసుకున్నాయి.

ముళ్లచెట్లపై సేదతీరుతున్న పెయింటెడ్ స్టార్క్





కృత్రిమ స్టాండులపై సేద తీరుతున్న పక్షులు







తాటియాకులగూడెం సమీప జాతీయ రహదారిపై గోతుల్లో నిలిచిన నీరు..జీలుగుమిల్లి నాలుగు రోడ్ల కూడలి జగదాంబ ఆలయం వద్ద రోడ్డు దుస్థితి

గోతుల రోడ్లపై అవస్థలు

జీలుగుమిల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ రాష్ట్ర సరిహద్దు తాటియాకుల గూడెం జీలుగుమిల్లి గ్రామాల్లో జాతీయ రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. చాన్నాళ్లుగా గిరిజన ప్రాంతంలో రహదారులు ధ్వంసం అయ్యి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. ఇటీవల జాతీయ రహదారులు విస్తరణలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం తాటియాకులగూడెం వయా జీలుగుమిల్లి మీదుగా కొత్తపట్టిసీమ వరకు కొత్తగా 369 కోట్లతో ఎన్‌హెచ్ 365 రహదారి నిర్మాణం పూర్తి చేసేందుకు ఈ ఏడాది జనవరిలో ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. అయితే వర్షాకాలం కావటంతో విడతల వారీగా పనులు సాగుతున్నాయి. ఈ రోడ్డు నిర్మాణం సంగతి ఎలా ఉన్నా ప్రస్తుతం తెలంగాణ రాష్ట్ర సరిహద్దు నుంచి తాటి యాకులగూడెం వయా జీలుగుమిల్లి మీదుగా జంగారెడ్డిగూడెం వెళ్లే ఎన్‌హెచ్ రహదారి గతంలోనే జాతీయ రహదారిగా ఎన్‌హెచ్ 516-డిగా గుర్తింపు పొందింది. తాటియాకులగూడెం నుంచి జీలుగుమిల్లి వరకు రెండు కిలోమీటర్ల మేర గల ఈ రోడ్డును ప్రస్తుత ఎన్‌హెచ్ అధికారులు ఎవరు పట్టించుకోవడం లేదు. ఏడాది క్రితం రహదారి మరమ్మతుల పేరుతో ఉన్న రోడ్డును పెకలించి ఇంతవరకు రోడ్డు నిర్మాణం పూర్తి చేయ్యలేదని స్థానికులు చెబుతున్నారు. నెల రోజుల క్రితం ఎస్సై వి.క్రాంతికుమార్ జేసీబీతో గోతులు సరి చేయించారు. ఇటీవల కురిసిన వర్షాలకు గోతులు పెద్దవిగా మారాయి. తెలంగాణలో సత్తుపల్లి అశ్వారావుపేట, ముంపు మండలాలైన కుక్కునూరు వేలేరుపాడు మండలాల వాసులకు ఈ రహదారిపై ప్రయాణ ఇబ్బందులు తప్పడం లేదు.

ధ్వంసమైన గిరిజన రహదారులు

గోతులమయమైన తాటియాకుల గూడెం-జీలుగుమిల్లి రోడ్డు

నిధులు మంజూరైనా నిర్మాణం లేదు

ఇటీవల జీలుగుమిల్లి నుంచి మక్కినవారి గూడెం వయా చింతలపూడి వేళ్లే రహదారి



వంకవారిగూడెం వద్ద ఇటీవల వర్షాలకు కొట్టుకుపోయిన రోడ్డు

గత 30 ఏళ్లగా నిర్మాణానికి నోచుకోలేదు. దీనికి ఇటీవల నాబార్డు సాయంతో రూ.3 కోట్లు ఎంపీ ఎమ్మెల్యేల ప్రోద్బలంతో నిధులు మంజూరు చేశారు. ప్రజా ప్రతినిధులు ఈ రహదారి నిర్మాణంకు శంకుస్థాపన చేసి నెలలు గడుస్తున్నా రహదారి పనులు ప్రారంభించ లేదు. దీంతో రహదారిపై ప్రయాణికుల ఇబ్బందులు వర్ణనాతీతంగా మారాయి. కాలం గడుస్తున్న కొద్ది గోతులు పెరిగి పెద్దవి అవుతున్నాయి. బర్రింకలపాడు నుంచి కామయ్యపాలెం మీదుగా రాచన్న గూడెం వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారిది ఇదే పరిస్థితి . అడవీ ప్రాంతం కావటంతో ఈ రోడ్డుపై రాత్రి 7 గంటలు దాటితే ప్రయాణించే వారు కన్పించడం లేదు. రహదారి బాగోక కొందరు తెలంగాణలో రాష్ట్రం అశ్వారావుపేట మీదుగా రాచన్న గూడెం, అంకన్నగూడెం గ్రామాలకు రాకపోకలు సాగిస్తున్నారు. జీలుగుమిల్లి నుంచి వంకవారిగూడెం వెళ్లే మధ్య వాగు వద్ద కల్వర్టు పూర్తిగా ధ్వంసం అయ్యింది. ప్రమాదం అంచున ద్విచక్ర వాహన దారులు ప్రయాణిస్తున్నారు. దాట్లవారిగూడెం, మడకం వారిగూడెం పండువారిగూడెం చీమలవారి గూడెం గిరిజన గ్రామాల వారు రాకపోకలు సాగించే వీలు లేకుండా పోయింది.



ఏలూరు తంగెళ్లమూడి లక్ష్మీనగర్‌లో ఇళ్ల మధ్య నిలిచిన వర్షం నీరు

వానొస్తే కాలనీ కాలవే !

విలీన గ్రామాల్లో నిలిచిపోతున్న వర్షపునీరు

ఏలూరు టూటౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): భారీవర్షానికి ఏలూరు నగరంలో పలు కాలనీలు జలమయమయ్యాయి. రోడ్లపై నిలిచిన నీటిని చాలా వరకు నీటిని తొలగించారు. విలీన గ్రామాల్లో పలు కాలనీల్లో వర్షపునీరు నిలిచిపోయింది. ఎక్కువగా ఖాళీస్థలాలు చెరువుల్లా మారాయి. వీటిని బయటకు తరలించేందుకు పారిశుధ్య సిబ్బంది నానా తంటాలు పడుతున్నారు. ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. వర్షం వచ్చి 42 గంటలు దాటిన ఇంకా కాలనీల్లో వర్షపునీరు తొలగకపోవడంతో వృద్ధులు, మహిళలు పాఠశాల విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. తంగెళ్లమూడి సత్రంపాడు,శనివారపుపేట, వెంకటాపురం విలీన గ్రామాల్లో రోడ్లపైకి నీరు చేరాయి. తంగెళ్లమూడి లక్ష్మీనగర్‌లో రెండురోజుల నుంచి ప్రజలు వర్షపునీటితో ఇబ్బందులకు గురవుతున్నారు. ఖాళీస్థలాల్లో చెట్లు ఏపుగా పెరగటం, వాటి కింద నీరు నిల్వ ఉండటంతో దోమలు ప్రబలుతున్నాయి. పశువుల ఆసుపత్రి ఆవరణ, ఎదురుగా ఉన్నరోడ్లపై నీరు నిలిచిపోయింది. సహాయకచర్యలు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. నగరంలో ఏడు విలీన గ్రామాలు కలవడంతో ప్రజలతో పాటు విస్తీర్ణం కూడా పెరిగింది. దానికి తగ్గట్టు పారిశుధ్య కార్మికులు పెరగలేదు.

సహాయక చర్యలు చేపడుతున్నాం

రెండురోజుల నుంచి సహాయక చర్యలు చేపడు తున్నాం. వర్షపు నీటిని తొలగిస్తున్నాం. కార్మికులు పగలు, రాత్రి నీటిని తొలగించే పనిలోనే ఉన్నారు. అధికారులంతా పర్యవేక్షిస్తున్నారు. డ్రైనేజీలు శుభ్రం చేస్తున్నాం. బుధవారం నాటికి పూర్తిస్థాయిలో నీటిని తొలగించే ఏర్పాట్లు చేస్తున్నాం. విలీన గ్రామాల్లో డ్రైనేజీ వ్యవస్థ మెరుగు పరిచేందుకు కృషి చేస్తాం.



శివారెడ్డి, డిప్యూటీ కమిషనర్



బస్సు ఎక్కడానికి అవస్థలు పడుతున్న విద్యార్థులు

ఒక్క బస్సుతో విద్యార్థుల అవస్థలు

పెదవేగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఒకే ఒక్క బస్సుతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. సక్రమంగా కళాశాలలకు వెళ్లలేకపోతున్నారు. మంగళవారం ఉదయం పెదవేగిలో బస్సు ఎక్కడానికి అవకాశం లేక చాలామంది విద్యార్థులు ఆగిపోయారు. ఏలూరు నుంచి పెదవేగి మీదుగా రంగాపురం వరకు ఒకే బస్సు నడుస్తోంది. రంగాపురం నుంచి బాదరాల వచ్చేసరికే బస్సు పూర్తిగా నిండిపోతుంది. దీంతో రామశింగవరం, కూచింపూడి, న్యాయంపల్లి, పెదవేగి, లక్ష్మీపురం గ్రామాల్లో విద్యార్థులు బస్సు ఎక్కేందుకు అవకాశమే ఉండడం లేదు. దీంతో విద్యార్థులు అధిక వ్యయ, ప్రయాసల కోర్చి కళాశాలలకు వెళ్లాల్సి వస్తోంది. కళాశాలల సమయాలకు అనుకూలంగా అదనంగా బస్సు సర్వీసులను ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు. ఆర్టీసీ విజయవాడ జోనల్ చైర్మన్ రెడ్డి అప్పలనాయుడు, ఆర్టీసీ అధికారులకు వినతిపత్రాలు ఇచ్చామని అయినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రంగాపురం నుంచి గోపన్నపాలెం వరకు 15 గ్రామాలు ఉన్నాయి. ఈ గ్రామాలకు ఒక్కటే ఆర్టీసీ బస్సు ఉండడంతో ముందుగా వచ్చే గ్రామాల్లోనే బస్సు నిండిపోవడంతో దిగువ గ్రామాల ప్రజలు బస్సు ఎక్కడానికి కష్టమవుతోంది.

ఎన్నాళ్లీ కష్టాలు..?

వర్షం వస్తే చెరువవుతున్న ఏలూరుపాడు గరువు ప్రాంతం

కాళ్ళ, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్ళుగా మురుగు నీటి సమస్యను ఎదుర్కొంటున్నా పంచాయతీ అధికారులుగాని, పాలకులు గాని కనీసం తమ వైపు కన్నెత్తి కూడా చూడటం లేదని ఏలూరుపాడు గరువు ప్రాంత వాసులు వాపోతున్నారు. వర్షాలు కురిస్తే మురుగు నీటిలోనే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షం కురిసిన ప్రతిసారి విష సర్పాలు ఇళ్ళల్లోకి వస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు పడుతూ లేస్తూ వెళ్ళాల్సిన పరిస్థితి ఉందని వాపోయారు. నీళ్ళు ఎక్కువ రోజులు నిల్వ ఉండటం వల్ల దోమలు ప్రబలి వ్యాధుల బారిన పడుతున్నామని తెలిపారు. ప్రతి ఏటా ఈ సమస్యను పంచాయతీ అధికారులు, ప్రజాప్రతినిధులు దృష్టికి తీసుకువెళ్ళినా శాశ్వత పరిష్కారానికి కనీసం చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి శాశ్వత పరిష్కారానికి మార్గం చూపాలని కోరారు. దీనిపై పంచాయతీ కార్యదర్శి ఎస్.అరుణాదేవిని వివరణ కోరగా స్థానికులు సమస్యను తన దృష్టికి తీసుకువచ్చారని, వెంటనే స్పందించి మురుగు నీటిని బయటకు మళ్ళించామని, సమస్య శాశ్వత పరిష్కారానికి ప్రణాళికలు కూడా సిద్ధం చేశామని తెలిపారు.



నీటిని మళ్లించే ప్రయత్నం చేస్తున్న పంచాయతీ సిబ్బంది



మొగల్తూరులో మెరక తోటల్లో సాగు చేసిన వంకాయలు

కలిసిరాని వంగ సాగు

తెగుళ్లతో పుచ్చుపట్టిన వంకాయలు

మొగల్తూరులో తోటలు వదిలేస్తున్న రైతులు

మొగల్తూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంతమైన మొగల్తూరు మండలంలో పలు గ్రామాల్లో మెరక తోటల్లో సాగు చేసిన వంగ సాగు రైతులకు నిరాశ కలిగించింది. ప్రతీ ఏటా జూన్, జూలై నెలల్లో తీర గ్రామాల్లో వంగతోటలు పెంచడం అనవాయితీ. కార్తీక మాసం వచ్చేసరికి అధిక దిగుబడులు వచ్చి ఆదాయం బావుంటుందనే ఉద్దేశ్యంతో పలువురు ప్రత్యేకంగా వంగతోట సాగు చేపడుతుంటారు. మొగల్తూరు, రామన్నపాలెం, కేపీ పాలెం, పేరుపాలెం, ముత్యాలపల్లి, కొత్తోట గ్రామాల్లోని మెరకభూముల్లో అంతర పంటగా లేక ప్రత్యేక పంటగా వంగ, తోటకూర, బీర, బెండ, దోస, దొండ సాగు చేస్తుంటారు. ఈ ఏడాది వంగతోటలకు వాతావరణం సానుకూలంగా లేకపోవడంతో తోటలు తెగుళ్ళ బారిన పడుతున్నాయని రైతులు పేర్కొంటున్నారు. దిగుబడికి వచ్చిన వంకాయలు రంగు అందంగా రావడానికి, పురుగు, పుచ్చు పట్టకుండా ఉండటానికి అనేక రకాల మందులు పిచికారీ చేసినప్పటికీ వంగ దిగుబడిలో పుచ్చుశాతం పెరిగిపోవడంతో సాగు ఖర్చులు, కూలి ఖర్చులు కూడా వచ్చే పరిస్థితి లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. సుమారు నాలుగు మాసాలు కష్టపడి వంగతోటలు పెంచామని దిగుబడి వచ్చే సమయంలో పుచ్చులు రావడంతో అమ్ముకోలేని పరిస్థితి నెలకొందని తోటలు వదిలేస్తున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

తోటలు పరిశీలిస్తాం : ప్రియదర్శిని, హార్టికల్చర్ అధికారి

మొగల్తూరు తీరంలో వంగతోటల పెంపకం దారులు దిగుబడికి పుచ్చు వచ్చి తీవ్రంగా నష్టపోయే పరిస్థితి వచ్చిందన్న సమాచారం తెలిసింది. మొగల్తూరు, ముత్యాలపల్లి గ్రామాల్లో వంగతోటలు పరిశీలించి తగు సూచనలు చేస్తామని ఉద్యాన వనశాఖాధికారి ప్రియదర్శిని తెలిపారు.

ప్రకృతి ఒడిలో పోషకాలు

సీజన్‌కు ముందే వచ్చిన తేగలు

తణుకు రూరల్ (ఆంధ్రజ్యోతి): తాడి చెట్ల నుంచి సీజనల్‌గా లభించే తాటి ముంజులు, తాడి పండ్లు, వాటి నుంచి మొలిచే తేగలు సీజన్‌కు ముందే అందుబాటులోకి వచ్చాయి. తేగలు మన దక్షిణ భారత దేశంలో ముఖ్యంగా తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు రాష్ట్రాల్లో ఎక్కువగా దొరుకుతాయి. ఉభయ గోదావరి జిల్లాల్లోని గోదావరి తీర ప్రాంతాల్లో తేగల విక్రయాలు ఎక్కువగా జరుగుతాయి. ప్రస్తుతం తాడి పండ్ల నుంచి జ్యూస్‌ను తీసి తాటి రొట్టెలు, గారెలు, పోకుండలుగా మార్కెట్‌లో విక్రస్తున్నారు. తేగలు సాధారణంగా అక్టోబరు-డిసెంబరు నెలల్లో ఎక్కువగా లభిస్తాయి. ఇవి గ్రామీణ ప్రాంతాల్లో సంప్ర దాయ ఆహారంగా పరిగణిస్తారు. దీపావళి తర్వాత నాగుల చవితికి పుట్టలో తేగలను నైవేద్యం పెట్టిన తర్వాతనే తినడం ప్రారంభిస్తారు. అయితే కాలమానం మార్పుల్లో ముందుగానే తాటికాయలు రావడంతో తేగలు అందుబాటులోకి వస్తున్నాయి.

ఆరోగ్యానికి మేలు

తేగలలో అనేక ఆరోగ్యానికి అవసరమైన పోషకాలు వున్నాయి. తేగలలో బీ1 థయామిన్, బీ2 రిబోఫ్లోవిన్, బీ3 రియాసిన్, సీ విటమినట్లు అధికంగా వున్నాయి. ఇవి శరీరంలోని రోగనిరోధక శక్తిని పెంచుతాయి. తేగలలో లభించే పొటాషియం, కాల్షియం, మెగ్నీషియం, ఫాస్పరస్, మొదలైన ఖనిజాలు ఎముకల ధృడత్వానికి, రక్తానికి మేలు చేస్తాయి. తేగలలో దాదాపు 60 శాతానికి పైగా పిండి పదార్థాలు, అధిక ఫైబర్ మిశ్రమం వుటుంది. దీని వల్ల జీర్ణక్రియకు సహాయ పడుతుంది. తేగల్లోని అధిక ఫైబర్ వలన మలబద్ధకం, గ్యాస్ సమస్యలు తగ్గుతాయి. పెద్ద పేగుల్లోని మలినాలను బయటకు పంపేందుకు దోహదం చేస్తుంది. అయితే వీటిని మితంగానే తీసుకోవాలి. అధికంగా తీసుకుంటే జీర్ణ సమస్యలు రావచ్చు.



జాతీయ రహదారి పక్కన తేగల విక్రయాలు..తణుకు పాలంగి రోడ్డులో తాటి గారెలు, రొట్టెల అమ్మకాలు



- **చవితికి ముందే వచ్చాయి..**

సాధారణంగా అక్టోబరు, నవంబరు నెల నుంచి తేగల అమ్మకం ప్రారంభమవుతుంది. ఇప్పుడు తాటి చెట్ల నుంచి కాయలు ముందుగా కాయడంతో ముందుగానే పాతర వేయడం వల్ల నాగుల చవితికి ముందే తేగలు అమ్ముతున్నాం. సైజ్‌ను బట్టి పెద్దవి అయితే 10 నుంచి 12 ఉన్న కట్ట రూ.100, చిన్న సైజులో ఉన్నవి 8 నుంచి 10 తేగలను రూ. 50లకు అమ్ముతున్నాం.

-నార్గని శ్రీను, రెడ్డి చెరువు



- **సహజసిద్ధమైన ఆహారం**

తేగలు స్థానిక సంస్కృతికి చెందిన ముఖ్యమైన ఆహారం. తేగలు సహజ సిద్ధమైన పోషకాలతో కూడిన ఆహారం. గ్రామీణ ప్రాంతాల్లో సంప్రదాయ ఆహారంగా పరిగణిస్తారు. పండుగల సమయంలో ఎక్కువగా లభిస్తుంది..తేగలను తాజాగానూ, నిల్వ చేసుకుని తినవచ్చు. దీనిలో పిండి పదార్థాలు, ఫైబర్ అధికంగా వున్నాయి. మనిషి ఆరోగ్యానికి అవసరమైన అన్ని విటమిన్ల, పోషకాలు తేగలలో సమృద్ధిగా వున్నాయి.

-గోపాలకృష్ణ ప్రసాద్, పోషకాహార నిపుణుడు, తణుకు

మత్స్యకార కుటుంబాలకు పరిహారం

కుటుంబానికి రూ.5 లక్షలు

వేటాడుతూ జిల్లాలో 12 మంది మృత్యువాత



నరసాపురం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): వేటాడుతూ ప్రమాదవశాత్తు చనిపోయిన కుటుంబాలకు ప్రభుత్వం పరిహారం ప్రకటించింది. గ్రూప్ యాక్సిడెంట్ ఇన్స్యూరెన్స్ పథకం (జీఏఐఎస్) కింద ఒక్కో కుటుంబానికి రూ.5 లక్షలు చొప్పున పరిహారం అందించనుంది. దీనికి సంబంధించి జిల్లాలోని 12 మంది మత్స్యకారులకు సుమారు రూ.60 లక్షలు పరిహారం అందనుంది. ఇందులో నరసాపురంలో 5, మొగల్తూరు 4, భీమవరం, యలమంచిలి, ఆచంట మండలాల్లో ఒక్కరు చొప్పున ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత మత్స్యకార కుటుంబాలకు పరిహారం అందించడం ఇది రెండోసారి.సముద్రం, గోదావరి, ఉప్పుటేర్లు, కాల్వల్లో వేటాడుతూ మత్స్యకారులు ప్రమాదబారిన పడి మృతి చెందుతున్న సంఘటనలు జిల్లాలో ఇటీవల ఎక్కువగా వెలుగు చూస్తున్నాయి. మూడేళ్ల క్రితం నరసాపురం మండలం బియ్యపుతిప్ప వద్ద సముద్ర వేటకు వెళ్లి తిరిగి వస్తుండగా అలలు ఉధృతికి బోటు బోల్తా పడింది. ఈ ఘటనలో బియ్యపుతిప్పకు చెందిన యువకుడు గల్లంతయ్యాడు. నేటికి మృతదేహం చిక్కలేదు. అయితే ప్రభుత్వం అధికారంలోకి రాగానే బాధిత కుటుంబానికి పరిహారం ఇచ్చారు.నాలుగు నెలల క్రితం నరసాపురం పట్టణం పొన్నపల్లి వద్ద సంప్రదాయ బోటుపై వేటాడుతుండగా బోల్తా పడింది. ఈ ఘటనలో మరో మత్స్యకారుడు మృతి చెందాడు.అలాగే మొగల్తూరు మండలంలో ఉప్పుటేర్లలో పడి ఇద్దరు మత్స్యకారులు మృతి చెందారు. వీరిందరికి ప్రభుత్వం గ్రూప్ యాక్సిడెంట్ ఇన్స్యూరెన్స్ పథకం కింద పరిహారం అందినుంది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ పరిహారం తూతు మంత్రంగానే అందేది. అయితే ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా కూటమి ప్రభుత్వం 15 నెలల కాలంలో రెండుసార్లు బాధిత కుటుంబాలకు పరిహారం అందించింది. తాజాగా రాష్ట్ర వ్యాప్తంగా మృతి చెందిన కుటుంబాలకు రూ.5.30 కోట్లు పరిహారం విడుదల చేసింది. అందులో జిల్లాలోని కుటుంబాలకు రూ.60 లక్షలు అందనున్నాయి. త్వరలో బాధిత కుటుంబాలకు చెక్కుల రూపంలో అందించనున్నారు.

నరసాపురంలో ఐదుగురికి పరిహారం

భారతి, మత్స్యశాఖ అధికారిణి

గ్రూప్ యాక్సిడెంట్ ఇన్స్యూరెన్స్ పథకం కింద ప్రభుత్వం మంజూరు చేసిన మొత్తాన్ని బాధిత కుటుంబాలకు త్వరలో అందిస్తాం. పట్టణ, మండలంలో వేటాడుతూ మృతి చెందిన వారు ఐదుగురు ఉన్నారు. వీరికి ప్రభుత్వం ప్రకటించిన పరిహారాన్ని త్వరలో అందించనున్నాం. ఇంకా మండలంలో ఒక కుటుంబానికి పరిహారం మంజూరు కావాల్సి ఉంది. డాక్యుమెంట్లు సమర్పించగానే వారికి కూడా పరిహారం అందిస్తాం.

ఆ..ఇంట్లో అందరూ గురువులే !

అమ్మ,నాన్న, కుమారులు ఉపాధ్యాయులే


తల్లితండ్రులతో కుమారులు లతీఫ్, సాధిక్

ఏలూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఒకే కుటుంబంలోని టీచరు దంపతులకు జన్మించిన ఇద్దరు కుమారులు కూడా ఇటీవల జరిగిన మెగా డీఎస్సీ-2025లో ఉపాధ్యాయ ఉద్యోగాలను సాధించిన అరుదైన విషయమిది. తండ్రి ఎండి రెహమాన్ పెదపాడు మండలం కొక్కిరపాడు స్కూలులో, తల్లి షేక్ షకీలా ఏలూరు రూరల్ మండలం మరడాని రంగారావు కాలనీ ప్రాథమిక పాఠశాలలో ఎస్జీటీలుగా పనిచేస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు. చిన్న కుమారుడు మహ్మద్ లతీఫ్ తెలంగాణ డీఎస్సీ-2024 రిక్రూట్‌మెంట్‌లో నాన్ లోకల్ కోటాలో ఎస్జీటీగా ఎంపికై హైదరాబాద్‌లో ఉద్యోగం చేస్తున్నాడు. మరో ప్రయత్నంగా లతీఫ్ రాష్ట్రంలో ఇటీవల జరిగిన మెగా డీఎస్సీ-2025కి ప్రిపేరవుతూనే తన అన్న మహ్మద్ సాధిక్‌ను కూడా ప్రేరేపిస్తూ డీఎస్సీలో మంచి ర్యాంకులతో ఇద్దరూ తొలి ప్రయత్నంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ఉపాధ్యాయ ఉద్యోగాలను సాదించారు. అన్నదమ్ములిద్దరూ ఏలూరు గాంధీనగర్ మున్సిపల్ హైస్కూలులో ఎస్జీటీలుగా నియమితులయ్యారు. కుటుంబమంతా ఉపాధ్యాయ వృత్తిలోనే స్థిరపడటం పట్ల యూటీఎఫ్ జిల్లా నాయకులు రాజారావు, షేక్ ముస్తఫా అలీ, రవికుమార్, రాంబాబు, తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

టెట్ నుంచి ఇన్‌సర్వీసు టీచర్లను మినహాయించాలి : ఏపీటీఎఫ్

ఏలూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఐదేళ్లకంటే ఎక్కువ సర్వీసు కలిగి, ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)లో అర్హత సాధించని టీచర్లు రెండేళ్లలో టెట్ క్వాలిఫై అవ్వాలని ఇటీవల సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం రివ్యూ పిటిషన్‌ను దాఖలుచేయాలని ఏపీటీఎఫ్ జిల్లాశాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామారావు, రెడ్డిదొర డిమాండ్ చేశారు. వాస్తవానికి 2011వ సంవత్సరానికి ముందే విధుల్లో చేరిన టీచర్లందరూ అప్పటి నిబంధనల ప్రకారం అమల్లో వున్న ఉపాధ్యాయ నియామక పరీక్ష ద్వారా ఎంపికైన విషయాన్ని గమనించాలన్నారు. ఈ నేపథ్యంలో వారికి టెట్ అవసరం లేదని ఉత్తర్వులున్నాయన్నారు. తాజాగా సుప్రీంకోర్టు ఉత్తర్వులపై మిగతా రాష్ట్రాల మాదిరిగానే ఏపీ ప్రభుత్వం కూడా రివ్యూ పిటిషన్‌ను దాఖలు చేసి, ఇన్‌సర్వీస్ టీచర్లకు టెట్ మినహాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

చలో ఢిల్లీకి ఏఐపీటీఎఫ్ పిలుపు

పెదవేగి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టీచర్స్ అర్హత టెస్ట్(టెట్) నుంచి మినహాయింపునివ్వాలని ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (ఆప్టా)జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సి.హెచ్.శివరామ్, ఎం.శ్రీనివాసరావు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. దేశంలోని ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులు టెట్ తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధిస్తేనే పదోన్నతి ఇవ్వాలనే సుప్రీంకోర్టు తీర్పును వ్యతిరేకిస్తూ అఖిల భారత ప్రాథమిక ఉపాధ్యాయ సమాఖ్య (ఏఐపీటీఎఫ్) ఇచ్చిన పిలుపు మేరకు నవంబరు నెల 24వతేదీన చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమం విజయవంతం చేయాలని కోరుతూ ఆప్టా ఉపాధ్యాయులకు పిలుపునిచ్చింది. ఆప్టా అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ 25 రాష్ట్రాలకు చెందిన ప్రతినిధులు గూగుల్ మీట్‌లో పాల్గొని ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారన్నారు. ఇన్‌సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ తప్పనిసరి అనే నిబంధన సరైన నిర్ణయం కాదని, ఈ విషయంలో ఉపాధ్యాయులు ఐక్యంగా ఉద్యమించి, వచ్చే నెల 24న జరిగే ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వారు విజ్ఞప్తి చేశారు.


విజేతలతో స్కూల్ ప్రిన్సిపాల్, తదితరులు

జాతీయ కరాటేలో విద్యార్థుల ప్రతిభ

ఏలూరు అర్బన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ఏలూరు సీఆర్ఆర్ ఇంజనీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఈనెల 11, 12 తేదీల్లో జరిగిన నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్-2025 పోటీల్లో రూరల్ మండలం చాటపర్రులోని భాష్యం హైస్కూలు బాలబాలికలు వివిధ కేటగిరీల్లో బహుమతులు గెలుచుకున్నారు. కటా విభాగంలో క్రిత, రఫీదా షేక్‌లకు ప్రథమ, అజిత్‌సింగ్, దివ్వేష్, తోరణ్‌లకు ద్వితీయ, గౌతమ్, తఫీక్, అఫియా, వైశాలిలకు తృతీయ బహుమతులు లభించాయి. సీనియర్స్ విభాగంలో జ్యోషిత లక్ష్మీ సంజనకు ప్రథమ బహుమతి లభించింది. విజేతలను భాష్యం విద్యాసంస్థల వెస్ట్‌జోన్ ఇన్‌చార్జి శ్రీమన్నారాయణరెడ్డి, ప్రిన్సిపాల్ కిరణ్‌కుమార్, కో-ఆర్డినేటర్ సంధ్యారాణి అభినందించారు.


సదస్సులో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు

భద్రతా చట్టాలపై అవగాహన అవసరం

ఏలూరు క్రైం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు చదువుతోపాటు క్రమ శిక్షణ అవసరమని జిల్లా అదనపు ఎస్పీ సూర్యచంద్రరావు సూచించారు. జిల్లా ఎస్పీ కెపిఎస్ కిషోర్ ఆదేశాల మేరకు ఏలూరు అమీనాపేటలో ఉన్న కెకెఆర్ గౌతమ్ స్కూల్లో విద్యార్థినులకు శక్తియాప్‌పై అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. సూర్యచంద్రరావు మాట్లాడుతూ విద్యతో పాటు భద్రతా చట్టాలపై అవగాహన కూడా అవసరమన్నారు. శక్తి యాప్ మహిళా భద్రత కోసం రూపొందించిన ఎమర్జెన్సీ రెస్పాన్స్ అప్లికేషన్ అని వివరించారు. ఆంధ్రప్రదేశ్ పోలీస్‌శాఖ దీనిని అభివృద్ధి చేసిందని, మహిళ, బాలికలు అత్యవసర పరిస్థితుల్లో తక్షణ పోలీస్ సహాయం పొందడానికి ఈ యాప్ ఉపయోగపడుతుందన్నారు. అత్యవసర పరిస్థితుల్లో 112కు కాల్ చేసి పోలీస్ సహాయాన్ని పొందవచ్చునని వివరించారు. కాల్ చేసి పది నిముషాల్లోపే పోలీసులు చేరుకుంటారన్నారు. జిల్లా వ్యాప్తంగా స్కూళ్ళు కాలేజీల వద్ద శక్తి టీమ్ సభ్యులు గస్తీ తిరుగుతూ విద్యార్థినులను ఎవరైనా వేధిస్తే వారిని అదుపులోకి తీసుకుంటారన్నారు.మహిళా ఎస్ఐ నాగమణి గుడ్‌టచ్ బ్యాడ్‌టచ్‌పై అవగాహన కల్పించారు. కెకెఆర్ గౌతమ్ స్కూల్ ప్రిన్సిపాల్ కెఆర్ రమేష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థిని అదృశ్యంపై కేసు

తాడేపల్లిగూడెం రూరల్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): తాడేపల్లిగూడెం మండలంలోని వాసవీ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతున్న హాస్టల్ విద్యార్థిని అదృశ్యమైనట్టు రూరల్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. ఏలూరు జిల్లా టి.నరసాపురం మండలం కేతవరానికి చెందిన ఎస్.జ్యోతి ఇంజనీరింగ్ కళాశాలలో సీఎస్సీ రెండో సంవత్సరం చదువుతోంది. ఈనెల 13న ఉదయం హాస్టల్ నుంచి కళాశాలకు వెళ్లి తిరిగి హాస్టల్‌కు తిరిగి రాకపోవడంతో తండ్రి లక్ష్మణరావుకు సమాచారం ఇచ్చారు. ఆచూకీ లేకపోవడంతో ప్రిన్సిపాల్ రత్నాకరరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు హెచ్‌సీ ఎండీ జిలాని తెలిపారు.

వెలుగుచూస్తున్న అక్రమాలు

మెప్మా.. చెప్మా?



- పట్టించుకోని అధికారులు
- విచారణల్లోనూ సర్దుబాటు
- ఆర్‌పీలపై ఎమ్మెల్యే సిఫారసు బేఖాతర్
- రికవరీలపై దృష్టిసారించని వైనం

(భీమవరం-ఆంధ్రజ్యోతి) : భీమవరం నాలుగో వార్డులో మెప్మా ప్రతినిధులు ఒక మహిళా సంఘాన్ని ఏర్పాటు చేశారు. అందులో పది మంది సభ్యులు ఉండాలి. ఐదుగురి వివరాలను సక్రమంగా సమర్పించారు. మరో ఐదుగురు పేర్లు వేర్వేరైనా సరే ఫొటో మాత్రం ఒక్కరిదే. దానిని పరిశీలిం చకుండా మెప్మా అధికారులు ఆన్‌లైన్‌లో నమోదు చేసి బ్యాంకుకు పంపించారు. తీరా బ్యాంకులో రుణం రాలేదు. సభ్యులు నిలదీస్తే అసలు విషయం బయటపడింది. సదరు సంఘానికి ఆర్‌పీగా ఉన్న మహిళ తప్పిదం వల్లే రుణం నిలిచిపోయిందంటూ ఇప్పుడంతా చర్చించుకుంటున్నారు. అదే రిసోర్స్ పర్సన్ (ఆర్‌పీ)ని తొలగించాలంటూ ఎమ్మెల్యే అంజిబాబు అధికారులకు లేఖ రాశారు. అయినా నిబంధ నలు ఒప్పుకోవంటూ లేఖను పక్కన పెట్టారు. కొందరు మెప్మా ప్రతి నిధులపై అనేక ఆరోపణలు ఉన్నాయి. గడిచిన ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా పనిచేశారు. అప్పట్లో వలంటీర్‌గా వ్యవహరించిన ఆర్‌పీని తొలగించాలంటూ ఎమ్మెల్యే అంజిబాబు లేఖ రాస్తే నిబంధనలంటూ కాలయాపన చేస్తున్నారు. సక్రమంగా సంఘాలను నిర్వహించడంలో విఫలమవు తున్న ఆర్‌పీలను తొలగించాలంటూ కూటమి నాయకులు బలంగా డిమాండ్ చేస్తున్నారు. వీరివల్ల ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తుందని మదనపడుతున్నారు. పలువురు ఆర్‌పీల భాగోతాలు మెప్మాలో ఒక్కొక్కటిగా వెలుగులోకి వస్తున్నాయి.

● మహిళా సభ్యులకు తెలియకుండా సొంత గ్రూపులను ఏర్పాటు చేసి రుణాలు తీసుకోవడం వంటి చర్యలకు పాల్పడుతున్నారు. తక్కువ వడ్డీలకు రుణాలు పొందుతూ కొందరు ఆర్‌పీలు దర్జా ఒలక బోస్తున్నారు. తాడేరులో ఏకంగా రూ.20 లక్షలు అవతవకలు జరిగినట్టు అంతా గప్పుమంది. దీనిపై మహిళా సంఘాల్లో చర్చ సాగుతోంది.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత చినఅమిరం పంచాయతీలో ముగ్గురు ఆర్‌పీలను తొలగించారు. వారి స్థానంలో మరో ముగ్గురు కొత్త ఆర్‌పీలను నియమించారు. మహిళా సంఘాలు తీర్మానం చేసుకుని కొత్తవారిని నియమించుకున్నారు. వారికి బాధ్యతలు అప్పగించడానికి మెప్మా అధికారులు తిప్పలు పెట్టారు. నాలుగు నెలల తర్వాత బాధ్యతలు అప్పగించారు. వైసీపీ హయాంలో పట్టణాల్లో పరిసర గ్రామాలను విలీనం చేయడంతో అక్కడ మహిళా సంఘాలు మెప్మా పరిధిలోకి వచ్చాయి. పంచాయతీల్లో సభ్యులు మెప్మా ఆధీనంలోనే రుణాలు పొందుతున్నారు.

వాస్తవానికి వైసీపీ ప్రభుత్వంలో అప్పటి అధికార పార్టీ ప్రజాప్రతినిధులు, నేతలు చెప్పినదానికి మెప్మా సిబ్బంది తలూపారు. భీమవరంలో ఒకేసారి 23 మంది ఆర్‌పీలను తొలగించారు. వైసీపీకి అనుకూలమైన వారిని ఆర్‌పీలుగా నియమించుకున్నారు. అందుకు తగ్గట్టుగానే వారంతా గడిచిన ఎన్నికల్లో వైసీపీకి అనుకూలంగా వ్యవహరించారు. స్వామి భక్తిని ప్రదర్శించారు. అయినా మహిళలు వారి మాటలను పెద్దగా పట్టించుకోలేదు. ఇప్పుడు కూటమి నేతలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ మహిళా సంఘాలను తమ చెప్పు చేతల్లో ఉంచుకునేలా కొందరు ఆర్‌పీల తీరు మెప్మాను అభాసుపాలు చేస్తోంది. జిల్లా అధికారులు విమర్శలను ఎదుర్కొంటున్నారు.ప్రజాప్రతినిధుల సిఫారసులను బేఖాతరు చేస్తున్నారు. అక్రమాలకు పాల్పడుతున్నారంటూ మహిళా సంఘాలు గగ్గోలు పెడుతున్నా సరే అధికారులు పెడచెవిన పెడుతున్నారు. పశ్చిమ గోదావరి జిల్లాలో అవతవకలు ఉన్నట్టు తేలిన నిధులకు సంబంధించి మెప్మా సుమారు రూ.కోటి పైగానే రికవరీ చేయాలి.

బంధువులే సభ్యులు

భీమవరంలో కొందరు ఆర్‌పీలు తమ సొంత బంధువులను సభ్యులుగా చేర్చి రుణాలు పొందుతున్నారు. సొంతానికి వాడుకుంటున్నారు. ఈవిధంగా నిధులు దుర్వినియోగం అయినట్టు తేలితే తూతూ మంత్రపు విచారణతో అధికారులు సరిపెడుతున్నారు. వైసీపీ హయాంలో భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం పట్టణాల పరిధిలో అవతవకలు వెలుగు చూశాయి. తాడేపల్లి గూడెంలో వైసీపీ నేత అనుచరురాలికి పట్టణ మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా బాధ్యతలు అప్పగించారు. అప్పట్లో ఆమెదే మున్సిపాలిటీలో అంతా అధికారం. తమ మాట వినని ఆర్‌పీలను వేధించడంలో ఎక్కడా వెనుకాడలేదు. అప్పటివరకు సక్రమంగా పనిచేసిన ఆర్‌పీలను తాడేపల్లిగూడెంలోనూ తొలగించేశారు. విధులు నిర్వహించకుండా పక్కన పెట్టేశారు. కొత్తవారితో బాధ్యతలు నిర్వహించారు. మహిళా సంఘాల నుంచి సొమ్ములు వసూలు చేసి పబ్బం గడిపేసుకున్నారు. మెప్మాలో ఆ వాసనలు ఇంకా పోలేదు. అవతవకలు జరుగుతున్నాసరే మెప్మా పెద్దగా పట్టించుకోవడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అక్రమాలు జరిగినట్టు తేలినా సరే రికవరీలు చేయడం లేదు.

బ్యాంకులకు వెళ్లని మహిళలు

రుణాలు తీసుకున్న కొంతమంది మహిళలు బ్యాంకులకు వెళ్లడం లేదు. ఇప్పటికీ ఆర్‌పీలే కీలకంగా వ్యవహరిస్తున్నారు. బ్యాంకుల వద్దకు ఆర్‌పీలు వెళ్లి మహిళా సంఘాల సొమ్ములు చెల్లిస్తున్న సందర్భాలుంటున్నాయి. రికార్డులు ఎలా నిర్వహిస్తున్నారనే విషయంపై మహిళా సంఘాల సభ్యులు అడిగే సాహసం చేయలేక పోతున్నారు. ప్రతి రెండేళ్లకు మహిళా సంఘాల సభలను ఏర్పాటు చేయాలి. వారి అభిప్రాయాలను సేకరించాలి. ఆర్‌పీలపై విశ్వాసం లేకపోతే మహిళా సభ్యులు వారిని తొలగించే హక్కు ఉంటుంది. గడిచిన ఐదేళ్లుగా సమావేశాలు ఏర్పాటు చేయడం లేదు. మహిళా సభ్యులు ప్రశ్నిస్తారన్న ఉద్దేశంతో సమావేశాలను దాటవేస్తున్నారు. దీర్ఘకాలంగా ఒకేచోట ఉద్యోగాలు చేస్తున్న సిబ్బంది అక్రమాలకు పాల్పడే ఆర్‌పీలను వెనకేసుకొస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మహిళలనుంచి ఫిర్యాదులు వెళితే విచారణ చేపడుతున్నారు. అంతా సవ్యంగా ఉందంటూ సరిపెడుతున్నారు. అక్రమాలకు పాల్పడే ఆర్‌పీలకు వంత పాడుతూ వస్తున్నారు.

అయ్యో పాపం..

బైక్ ఢీకొని విరిగిన ఎడమ కాలు

- ఇప్పటికే కుడికాలికి పోలియోతో ఇబ్బంది పడుతున్న మహిళ


విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

ముదినేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):పోలియో వ్యాధికి గురై కుడికాలు పనిచేయని ఓ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో ఎడమ కాలు విరిగిపోయిన హృదయ విదారక సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ముదినేపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పోలియో వ్యాధిగ్రస్తురాలు మద్దాల నామణి శనివారం రాత్రి ఆ గ్రామ సెంటరులో నిలబడి ఉండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌తో ఢీకొని వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఆమె ఎడమకాలు విరిగి పోయింది. కిందపడి విలవిల్లాడుతున్న ఆమెను వెంటనే 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సోమవారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి ముదినేపల్లి పోలీస్ స్టేషన్ హెచ్‌సీ ఎస్వీ రామారావు దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బంకులో విజిలెన్స్ విచారణ

● బిల్లుల మాయాజాలంతో రూ.78 లక్షలు గోల్‌మాల్

ఏలూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన ఏలూరు బస్టాండ్ పెట్రోల్ బంకులో ఇటీవల బిల్లుల గోల్‌మాల్ చేసి రూ.78 లక్షల పైబడి సిబ్బంది అవకతవకలకు పాల్పడ్డారు. దీనిపై లోతుగా విచారణ చేపట్టేందుకు విజిలెన్స్ అధికారులు మంగళవారం తనిఖీలు చేసి పలు రికార్డులను స్వాధీనం చేసుకున్నట్టు సమాచారం.మరోవైపు విజయవాడ నుంచి చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ శివరామ్ కూడా తనిఖీలు చేపట్టారు. ఐదేళ్ల క్రితం నుంచి ఈ బంకులో పేటీఎం, గూగూల్ పే, ఇతరత్రా బిల్లుల జమ విషయంలో డిప్లో క్లర్క్, 10 మందికి పైగా అవుట్ సోర్సింగ్ సిబ్బంది మాయాజాలం ప్రదర్శించి లక్షల్లో జమ కావాల్సిన సొమ్మును కాజేశారు. గత తొమ్మిది నెలలు వివరాలను 15 రోజులు కుస్తీపట్టి అధికారులు పాత బిల్లులు చూస్తే అందులో 78 లక్షలు గోల్‌మాల్ జరిగినట్టు తేలింది. ఇంకా గతంలోని పాత బిల్లులు రోజువారీ తనిఖీ చేస్తే భారీ మొత్తాల్లో వివరాలు బయటపడే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని యువకుడి మృతి

పాలకొల్లు రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాలకొల్లు- నరసాపురం మెయిన్ రోడ్డు దిగమర్రు వద్ద మోటారు బైక్‌ను ఆయిల్ ట్యాంకర్ ఢీకొన్న ప్రమాదంలో కొల్లి మహేశ్ రాజు(18) అక్కడికక్కడే మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం తణుకు పట్టణం పాతూరుకు చెందిన కొల్లి మహేశ్ రాజు, గాజులుపాటి సాయిగణేశ్, కూచి చరణ్ శర్మ మంగళవారం తణుకు నుంచి పేరుపాలెం బీచ్‌కు మోటార్ సైకిల్‌పై బయల్దేరారు. పాలకొల్లు- నరసాపురం మెయిన్ రోడ్డు దిగమర్రు వద్ద వీరి బైక్‌ను ఆయిల్ ట్యాంకర్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కొల్లి మహేశ్ రాజు అక్కడికక్కడే మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. గాజులుపాటి సాయి గణేశ్, కూచి చరణ్ శర్మలకు తీవ్ర గాయాలవడంతో పాలకొల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో గాజులుపాటి సాయిగణేష్ పరిస్థితి విషమంగా ఉండటంతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హెడ్ కానిస్టేబుల్ చింతపల్లి వెంకట నారాయణమూర్తి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

ఏలూరు క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చిన్నప్పుడే తల్లిదండ్రులు చనిపోవడంతో అన్నయ్యతో కలిసి ఉంటున్న ఆ యువకుడు మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో పురుగుమందు తాగి తీవ్ర అస్వస్థతకు గురై ఏలూరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. నల్లజర్ల మండలం కౌలూరు గ్రామానికి చెందిన బేతిన గిరిబాబు(29) చిన్నప్పుడే తల్లిదండ్రులు మరణించడంతో అతడి సోదరుడితో కలిసి ఉంటున్నాడు. గిరిబాబు మద్యానికి బానిసై మద్యం మత్తులో ఈ నెల 12న పురుగు మందు తాగాడు. పరిస్థితి విషమించడంతో మంగళవారం మృతి చెందాడు.

వ్యాన్ పైనుంచి జారిపడి ఒకరి మృతి

వీరఘట్టం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో మంగళవారం వ్యాన్‌పై నుంచి జారిపడి ఘటనలో పెనుమాక రాజు(36) మృతి చెందాడు. తాడేపల్లిగూడెం నుంచి గోనె సంచుల వ్యాన్ వీరఘట్టం వచ్చింది. ఆ వ్యాన్‌తో పాటు రాజు వచ్చాడు. ఇక్కడ గోనె సంచులు దించిన తర్వాత వ్యాన్‌పైన తాళ్లు సరిచేసే క్రమంలో ప్రమాదవశాత్తూ రాజు జారిపడ్డాడు. స్థానిక పీహెచ్‌సీకి తరలించగా అప్పటికే రాజు మృతి చెందినట్టు వైద్యులు తెలిపారు.

పాము కాటుతో వ్యవసాయ కూలీకి అస్వస్థత

పోలవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పాము కాటుతో వ్యవసాయ కూలీ అస్వస్థతకు గురైన ఘటన పోలవరం మండలం కొత్తపట్టిసీమలో మంగళవారం జరిగింది. కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన గంటా శివ ఉదయం పొలాల్లోకి కూలి పనికి వెళ్తుండగా పాము కాటు వేయడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. స్థానికులు అతనిని పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అక్కడి వైద్యులు చికిత్స అందించి పర్యవేక్షణలో ఉంచారు. ప్రస్తుతం అతడి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు.

మద్ది ఆంజనేయుని దర్శనానికి వెళ్లి తిరిగొస్తూ ..

రిటైర్డ్ ఏఎస్ఐ మృతి

- వేగవరం గ్రామ శివారులో జల్లేరు బ్రిడ్జి వద్ద ప్రమాదం


జగ్గారావు (ఫైల్)

జంగారెడ్డిగూడెం,అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : గుర్వాయిగూడెంలోని మద్ది అంజనేయ స్వామిని దర్శించుకుని తిరిగి ఇంటికి వెళ్తూ రిటైర్డ్ ఏఎస్ఐ నార్లపాటి జగ్గారావు (60) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన మంగళవారం జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామ శివారులో జల్లేరు బ్రిడ్జి వద్ద జరిగింది. పోలీసులు, మృతుడి కుమారుడు తెలిపిన వివరాలివి.. తెలంగాణ రాష్ట్రం, కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట మండలం పేరాయిగూడెం గ్రామానికి చెందిన మృతుడు నార్లపాటి జగ్గారావు తెలంగాణలో ఏఎస్ఐగా పనిచేసి రిటైర్ అయ్యారు. తనకిష్ట దైవమైన జంగారెడ్డిగూడెం మండలం గుర్వాయిగూడెం గ్రామంలో ఉన్న మద్ది అంజనేయస్వామిని దర్శించుకోవడానికి మంగళవారం ఉదయం తన ద్విచక్ర వాహనంపై భార్య సరోజినితో కలిసి వచ్చారు. అక్కడ స్వామిని దర్శించుకుని తిరిగి బైక్‌పై ఇంటికి బయలుదేరారు. జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామ శివారులోని జల్లేరు వంతెన వద్దకు చేరుకునే సరికి ఓ వాహనాన్ని ఓవర్‌టేక్ చేసే క్రమంలో తాడువాయి వైపు నుంచి వేగవరం వస్తున్న వేగవరం గ్రామానికి చెందిన పాల వెంకన్న బాబు ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీ కొట్టారు. ఈ ఘటనలో ఇరు వాహనదారులకు తీవ్ర గాయాలు కాగా మృతుడు భార్య సరోజిని కి స్వల్ప గాయాలయ్యాయి. వీరిని జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలిస్తుండగా జగ్గారావు మార్గ మధ్యలోనే మృతి చెందారు.మరో ద్విచక్ర వాహన దారుడు పాల వెంకన్న బాబుకు కుడి కాలుకు తీవ్ర గాయం కాగా ప్రస్తుతం చికిత్స పొందుతున్నాడు. మృతుడు జగ్గారావుకు కుమారుడు, కుమార్తె ఉన్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిధుల దుర్వినియోగం కేసులో

రిటైర్డ్ కార్యదర్శి అరెస్టు

- 2013లో నమోదైన జంగారెడ్డిగూడెం పంచాయతీ నిధుల దుర్వినియోగం

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : జంగారెడ్డిగూడెం గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగం కేసులో అప్పటి పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన పగడం నాగేశ్వరరావును మంగళవారం అరెస్ట్ చేశామని ఎస్ఐ ఎస్‌కే.జబీర్ తెలిపారు. 2013లో జంగారెడ్డిగూడెం మేజర్ గ్రామ పంచా యతీగా ఉన్నప్పుడు పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన నాగేశ్వరరావుపై పంచాయతీ నిధులు దుర్వినియోగం చేశారని అప్పట్లో కేసు నమోదైంది. ప్రస్తుతం ఆయన రిటైర్ అయ్యారు. ఈ కేసు విషయంలో అతడు గతంలో కోర్టు నుంచి స్టే తెచ్చుకున్నారు. కోర్టు ఇచ్చిన స్టే సమయం ముగియడంతో మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా రిమాండ్ విధించినట్టు ఎస్ఐ తెలిపారు.

బ్యాంకులో మంటలు..

- వేగంగా స్పందించిన ఏలూరు ఫైర్ సిబ్బంది
- అప్రమత్తమైన స్థానిక పోలీస్ అధికారులు
- మంటలు అదుపు చేయడంతో అంతా సేఫ్


లాకర్ రూమ్ పరిశీలిస్తున్న పోలీసులు

ఏలూరు క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకోగా ఫైర్ సిబ్బంది వేగంగా స్పందించి భారీ నష్టాన్ని నివారించగలిగారు. తాళాలు వేసి ఉన్న బ్యాంకులో పొగలు వెదజిమ్మడంతో అటుగా వెళ్తున్న వారు అగ్నిమాపక సిబ్బందికి సమాచారమివ్వడంతో సిబ్బంది చాకచక్యంగా మంటలను అదుపు చేసి భారీ నష్టం జరగకుండా కాపాడగలిగారు. ఏలూరు శనివారపు పేట రోడ్డు సెయింట్ థెరిస్సా డిగ్రీ కాలేజీ (సెయింట్ ఆన్స్) కాలేజీలోని యూనియన్ బ్యాంక్ బ్రాంచ్‌లో సోమవారం ఉదయం 8.15గంటల సమయంలో బ్యాంకు లోపలి నుంచి పొగలు రావడాన్ని ఎస్.సాయి అనే వ్యక్తి గమనించి అగ్ని మాపక శాఖకు ఫోన్ చేశారు. మూడు నిమిషాల్లోనే ఫైర్ ఇంజన్ అక్కడకు చేరుకుని మంటలు అదుపు చేయగలిగారు. సమీపంలోనే ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ నివాసం ఉండడంతో తన సిబ్బందితో అక్కడికి చేరుకుని ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. అగ్నిమాపక శాఖ అదనపు జిల్లా ఫైర్ ఆఫీసర్ వి.రామకృష్ణ, సిబ్బంది ఆ పొగలో ఆక్సిజన్ సిలెండర్ మాస్కులతో లోపలికి వెళ్లి మంటలు అదుపు చేశారు. త్రి టౌన్ సీఐ వి. కోటేశ్వరరావు, ఎస్ఐ రాంబాబు, వారి సిబ్బంది అక్కడకు చేరుకుని బందోబస్తు ఏర్పాటు చేశారు.బ్యాంకులోని ఏసీ యూనిట్‌లో అగ్నిప్రమాదం జరిగినట్టు అగ్నిమాపక శాఖ అధికారులు గుర్తించారు. మరోవైపు బ్యాంకులో లైట్లు మినహా ఎలాంటి ఏసీలు ఆన్ చేయలేదని బ్యాంక్ మేనేజర్ టి.రాజాజీ చెబుతున్నారు. బ్యాంకులోని రెండు ఏసీలు, రెండు ఫ్యాన్లు, రెండు టేబుల్స్, గోల్డ్ వెయింగ్ మిషన్లు, స్టేషనరీ, మాత్రమే దగ్ధమైనట్టు గుర్తించారు. నగదు ఉన్న చెస్ట్ రూమ్, లాకర్స్ ఉన్న రూమ్‌లు భద్రంగా ఉన్నాయి. ఆ రూముల్లోకి ఎలాంటి మంటలు వ్యాపించలేదు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్, త్రి టౌన్ సీఐ వి.కోటేశ్వరరావు, బ్యాంకు ఉన్నతాధికారుల సమక్షంలో బ్రాంచ్ మేనేజర్ రాజాజీ తాళాలు తీసి పరిశీలించారు. ఏలూరు డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ మాట్లాడుతూ ఖాతాదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, లాకర్లు భద్రంగా ఉన్నాయని స్పష్టం చేశారు. సోమవారం మధ్యాహ్నం నుంచి ఖాతాదారులు తమ లాకర్లను పరిశీలించుకోవడానికి బ్యాంక్ మేనేజర్ టి.రాజాజీ అనుమతించడంతో లాకర్లు ఉన్న వారు వచ్చి వాటిలో ఉన్న వస్తువులను చూసుకుని అంతా భద్రంగా ఉన్నాయంటూ వెళ్లారు. బ్యాంక్‌లో మూడు లక్షల రూపాయల విలువైన ఫర్నిచర్ దగ్ధమైనట్టు అంచనా వేశారు. మరో 47 లక్షల రూపాయల సొత్తును కాపాడుకోగలిగామని జిల్లా అదనపు ఫైర్ ఆఫీసర్ రామకృష్ణ చెప్పారు.


రిసెప్షనిస్టుతో మాట్లాడుతున్న ఎస్పీ కిశోర్

ఫిర్యాదుదారులకు మెరుగైన సేవలందించాలి

- రిసెప్షనిస్టుల సమావేశంలో ఎస్పీ కిశోర్ సూచనలు

ఏలూరు క్రైం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులకు మెరుగైన సేవలందించడం ద్వారా పోలీస్ వ్యవస్థపై ప్రజల్లో విశ్వాసం పెంపొందుతుందని ఏలూరు జిల్లా ఎస్పీ కేపీఎస్ కిశోర్ పేర్కొన్నారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్లలో రిసెప్షనిస్టులుగా పనిచేస్తున్న సిబ్బందికి ఒక్కరోజు అవగాహన సదస్సును ఏలూరు జిల్లా పోలీస్ కార్యాలయంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ స్టేషన్‌కు వచ్చే వారిని కూర్చోబెట్టి మంచినీరు అందించడం ద్వారా సౌకర్యాన్ని కల్పించాలన్నారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే వారికి ముందుగా రిసెప్షనిస్టులే కనిపిస్తారని, వారే పోలీస్‌శాఖ గౌరవం పెంపొందించేలా నడుచుకోవాలని సూచించారు. రిసెప్షనిస్టుల పాత్ర కేవలం ఫిర్యాదులు స్వీకరించడం కాదని, పోలీస్ స్టేషన్, ప్రజల మధ్య వారధిగా పనిచేయాలన్నారు. పలువురు రిసెప్షనిస్టుల నుంచి ఎస్పీ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఏఎస్పీ ఎన్.సూర్య చందరరావు, కైకలూరు రూరల్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, డీసీఆర్బీ ఇన్‌స్పెక్టర్ అబీబ్ బాషా, మహిళా పోలీస్ స్టేషన్ ఎస్ఐ నాగమణి పాల్గొన్నారు.

ఇంటర్ విద్యార్థి ఆత్మహత్య

కామవరపుకోట, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని తూర్పు యడవల్లి గ్రామానికి చెందిన ఇంటర్ విద్యార్థి చొదిమెళ్ల అభినాశ్(18) మంగళవారం రాత్రి తన ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. తడికలపూడి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. తల్లి ఎప్పటి నుంచో కువైట్‌లో ఉంటోంది. అయితే అభినాశ్ సరిగా కళాశాలకు వెళ్లకపోవడంతో పని చేసేందుకు తల్లి కువైట్ రావాలని హెచ్చరించినట్టు సమాచారం. అయితే కువైట్ వెళ్లడం ఇష్టం లేకే ఇలా చేశాడా అన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

బంధువుల ఇంటికి వెళ్లొచ్చేసరికే దోచేశారు

ముసునూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులకొట్టి చోరీకి పాల్పడి విలువైన వస్తువులు, నగదును అపహరించిన ఘటన గోగులంపాడు గ్రామంలో జరిగింది. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన యలమంచిలి జగదీష్, భార్య నళిని ఈనెల 12వ తేదీ ఉదయం ఇంటికి తాళాలు వేసి నూజివీడులో బంధువుల ఇంటికి వెళ్లారు. 13వ తేదీ సాయంత్రం నూజివీడు నుంచి తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులకొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా, బీరువాలోని ఒక కాసు బంగారు చైన్, రెండు వెండి గిన్నెలు, కుంకుమ భరిణి, రూ.8 వేలు నగదు అపహరించినట్టు గుర్తించి ముసునూరు పోలీసులకు బాధితుడు సమాచారం ఇచ్చాడు. చోరీ ప్రాంతానికి క్లూస్ టీమ్‌ను రప్పించి, ఆధారాలు సేకరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

చనిపోయిన బావమరిదిని చూసేందుకు వెళ్తూ..

క్వారీ లారీని ఢీకొట్టి మోటార్ సైక్లిస్టు మృతి.. మరొకరికి గాయాలు


లారీ కిందికి వెళ్లిన మోటార్ సైకిల్


నాగు(ఫైల్)

దేవరపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): లారీని మోటార్ సైకిల్ ఢీకొన్న ఘటనలో ఒక వ్యక్తి మృతి చెందగా మరొకరికి తీవ్రగాయాలయ్యాయి. దేవరపల్లి మండలం యర్నగూడెం వద్ద ఈ ప్రమాదం జరిగింది. దొమ్మేరు నుంచి విజయవాడకు దొడ్డినాగు మరో వ్యక్తి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నారు. యర్నగూడెం శివారు గండిచెరువువద్ద క్వారీ లారీ మలుపు తిరుగుతుండగా వెనుక నుంచి వేగంగా మోటార్ సైకిల్‌పై వచ్చి ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో పోలవరం మండలం కొత్తపట్టిసీమ గ్రామానికి చెందిన దొడ్డి నాగు(35) అక్కడికక్కడే మృతి చెందగా కొవ్వూరు మండలం దొమ్మేరు గ్రామానికి చెందిన తాళ్ల అభిషేక్‌కు కాలు విరగడంతో కొవ్వూరు ప్రభుత్వ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. విజయవాడ లో తన బావమరిది చనిపోయాడని తెలుసుకుని తన మేనమామ కుమా రుడు తాళ్ల అభిషేక్‌తో మోటార్ సైకిల్‌పై వెళుతుండగా మంగళవారం ఉద యం ఈ ప్రమాదం జరిగింది. నాగుకు భార్య సీత, కుమార్తె రచిత, కొడుకు చరణ్ ఉన్నారు. నాగు మృతదేహాన్ని గోపాలపురం సామాజిక ఆరోగ్య కేంద్రానికి పోస్టుమార్టం నిమిత్తం తరలించినట్లు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రణీత్‌కు అధికారులు న్యాయం చేయాలి

బుట్టాయగూడెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎస్టీ కుల ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు మంజూరు చేయాలని కోరుతూ తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజా సంఘాల ఆధ్వర్యంలో నిరహార దీక్ష చేస్తున్న కుంజా ప్రణీత్‌కు అధికారులు న్యాయం చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు కారం రాఘవ డిమాండ్ చేశారు. ప్రణీత్ దీక్ష మంగళవారానికి 8వ రోజుకు చేరింది. న్యూడెమోక్రసీ, పీవైఎల్, కేవీపీఎస్ నాయకులు నాయకులు రాఘవ, టి.బాబూరావు, ఎఫ్రాన్సిస్ దీక్షకు మద్దతు తెలిపారు.

పేదలకు విద్య అందేలా చర్యలు తీసుకోవాలి : ఎంఈవో

పోలవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విద్యను పేదలకు అందుబాటులో ఉంచాలని మండల విద్యాశాఖాధికారి సత్యనారాయణ సూచించారు. మంగళవారం మండలంలో ఎల్లండీపేట, నూతనగూడెం పాఠశాలల్లో ఆయన తనిఖీలు నిర్వహించి పరీక్షలు జరుగుతున్న తీరుని పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్పొరేట్ పాఠశాలలను మించి మౌలిక వసతులు కల్పిస్తోందన్నారు. ఉపాధ్యాయులు తమ పరిధిలోని విద్యార్థులు బడికి వచ్చేలా చూడాలన్నారు. ప్రభుత్వం అందించే ఉచిత విద్యను పొందాలని కోరారు.

చలో ఐటీడీఏను విజయవంతం చెయ్యండి

కుక్కునూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏజెన్సీలో గిరిజనులు సాగు చేస్తున్న పోడుభూములకు హక్కుపత్రాలు ఇవ్వాలని కోరుతూ ఈ నెల 22న జరిగే కె.ఆర్.పురం ఐటీడీఏ ముట్టడి కార్యక్రమం విజయవంతం చేయాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య కోరారు. మంగళవారం కుక్కునూరు మండల కేంద్రంలో ఆ పార్టీ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడారు. స్వాతంత్ర్యం వచ్చి 78 ఏళ్లు గడుస్తున్న గిరిజనుల అభివృద్ధి ఏ మాత్రం జరగలేదన్నారు. కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో 30ఏళ్ల నుంచి పోడు భూములు సాగు చేస్తున్న గిరిజనులు, వలస గిరిజనులకు హక్కుపత్రాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అలాగే ఆంధ్రుల జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టు కోసం సర్వం త్యాగం చేసిన నిర్వాసితులను ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి కొన్నే లక్ష్మయ్య, వరకా శ్యామలా, ఐతా సురేశ్‌బాబు, కె.బాబూరావు, వెంకటాచారి, పూనెం లక్ష్మయ్య పాల్గొన్నారు.

హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఒక గేమ్ ఛేంజర్: ఎంపీ

ఏలూరుటూటౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలోనే అత్యంత ప్రతిష్ఠాత్మకమైన గూగుల్ సంస్థ విశాఖలో హైపర్ స్కేల్ డేటా సెంటర్ ఏర్పాటు రాష్ట్రాభివృద్ధిలో ఒక గేమ్ ఛేంజర్‌గా మారనుందని ఎంపీ పుట్టా మహేశ్ కుమార్ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, గూగుల్ సంస్థ మధ్య మంగళవారం జరిగిన చారిత్రాత్మక ఒప్పందంపై ఎంపీ మహేశ్ హర్షం వ్యక్తం చేశారు. ఈ ఒప్పందంతో రాష్ట్ర ఐటీ పరిశ్రమ రూపురేఖలు మారనున్నాయన్నారు. గత 16నెలల్లోనే రాష్ట్రానికి 11లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు వచ్చాయన్నారు. ఇప్పుడు గూగుల్ డేటా కంపెనీతో రాష్ట్ర యువతకు ప్రపంచ స్థాయి ఉద్యోగ, నైపుణ్యత అవకాశాలు లభించనున్నాయన్నారు. పాఠశాల స్థాయి నుంచి ఏఐ పాఠ్యాంశాలను సిలబస్‌లో చేరుస్తున్నామన్నారు. రానున్న ఐదేళ్లలో గూగుల్ సంస్థ ఈ ప్రాజెక్టు ద్వారా 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెట్టనుందన్నారు.

అనుమతులుంటేనే దీపావళి సామగ్రి విక్రయించాలి


దుకాణాలు ఏర్పాటు చేసే స్థలం పరిశీలిస్తున్న దృశ్యం

టి.నర్సాపురం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అనుమతులు లేకుండా మందు గుండు సామగ్రి విక్రయాలు చేస్తే చర్యలు తప్పవని జీలుగుమిల్లి సీఐ వెంకటేశ్వ రరావు హెచ్చరించారు. దీపావళి పండుగను పురస్కరించుకుని మండలంలోని బొర్రంపాలెం, టి.నర్సాపురం గ్రామాల్లో ఏర్పాటు చేయనున్న దీపావళి బాణసంచ దుకాణాల స్థలాలను మంగళవారం ఎస్.ఐ. ఎం.జయబాబు, తహసీల్దార్ సాయి బాబా సిబ్బందితో కలిసి సీఐ పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ బాణసంచా దుకాణదారులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫైర్ డిపార్ట్‌మెంట్ అధికారులు వాటర్ ట్యాంకును, సిబ్బందిని అందుబాటులో ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట వీఆర్వో ఫణికుమార్, సుబ్బారావు ఉన్నారు.

మునిసిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

చింతలపూడి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వివిధ మున్సిపల్ కార్పొరేషన్, నగర పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని కోరుతూ నవంబరు 3వ తేదీ నుంచి సమ్మె చేస్తున్నట్టు ఏపీ మున్సిపల్ వర్కర్ యూనియన్, ఏఐటీయూసీ అనుబంధ చింతలపూడి శాఖ అధ్యక్షురాలు వి.అనూరాధ పేర్కొన్నారు. ఈ రోజు మున్సిపల్ కార్మికుల సమస్యలపై సమ్మె నోటీసులు మున్సిపల్ కమిషనర్ అంబటి రాంబాబుకు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరణించిన కార్మికుల స్థానంలో వారి కుటుంబ సభ్యులను తిరిగి తీసుకోవాలని, కార్మికులకు ప్రస్తుతం ఉన్న బ్యాంకు ఖాతా నుంచి యాక్సిస్ బ్యాంకు ఖాతాకు మళ్లించుకోవాలన్న ఒత్తిడి ఆపాలన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన సమ్మె విరమణ ఒప్పందంలో వర్క్ఆఫ్ నేచర్‌ను బట్టి ప్రస్తుతం పని చేస్తున్న ఇంజనీరింగ్ సిబ్బందికి వేతనాలు పెంచాలని, పారిశుధ్య కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని డిమాండ్ చేస్తున్నట్టు తెలిపారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో కార్మిక సంఘం నాయకులు టి.బాబు, కె.గురవయ్య ఉన్నారు.

ఘనంగా ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవాలు


మాట్లాడుతున్న సంఘ నాయకుడు

లింగపాలెం, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఆధ్వర్యంలో ధర్మాజీగూడెంలో స్థానిక రామాలయంలో మంగళవారం శత వార్షిక వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ కిశోర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్ఎస్ఎస్ శత వార్షికోత్సవాలు జరుపుకుంటున్న సందర్భంగా ఆర్ఎస్ఎస్ విధివిధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. విశ్వవ్యాప్తంగా భారతీ యులపై ఎంతో గౌరవం పెరిగిందని, రాబోయే రోజుల్లో శక్తివంతమైన దేశంగా భారత్ ఎదుగుతుందన్నారు. ప్రతి ఒక్కరూ దేశం కోసం పనిచెయ్యాలన్నారు. కృష్ణ ప్రసాద్, శివగణేశ్, సతీశ్, సత్యనారాయణ, గణపతి, కేవీఎస్‌వీ ప్రసాద్, సాయికృష్ణ, నాగేశ్వరరావు, శివ పాల్గొన్నారు.

రూ.8.2 లక్షల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

జంగారెడ్డిగూడెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పేదల ఆరోగ్యానికి సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో దోహదపడుతుందని టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొండ్రెడ్డి కిశోర్ అన్నారు. మంగళవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారుల కుటుంబ సభ్యులకు అందజేశారు. మండలానికి చెందిన షేక్ పాతిమున్నీసాకు రూ.52 వేలు, కోనా పద్మకు రూ.30 వేలు,పోకల వీర రాఘవులు రూ.లక్షా యాభై వేలు, చీమల రాముకు రూ.5 లక్షల 34 వేలు, వరద నాగబాబుకు రూ.55 వేలు మొత్తం రూ.8.21 లక్షల చెక్కులను అందజేసినట్టు కిశోర్ తెలిపారు. రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, టీడీపీ నాయకులు గుమ్మడి ప్రసాద్, బిలాల్ మసీదు అధ్యక్షుడు షేక్ యాకూబ్, షేక్ నజీర్, రఫి, గెడా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

17 ఏళ్లలోపు వారికి.. ఆధార్ నవీకరణ ఉచితం

(5వ పేజీ తరువాయి)

కార్డుల జారీకి దరఖాస్తులు రావడం, వాటిని నవీకరణకు పంపడం చేస్తున్నట్లు పోస్టల్‌శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇటీవల ఏలూరులో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు.

తూతూమంత్రంగా కేంద్రాల నిర్వహణ : ఆధార్ కేంద్రాల నిర్వహణపై ఏ శాఖ నుంచి కూడా ప్రజలకు సరైన సమాచారం అందివ్వకపోగా, ప్రచారం కల్పన కూడా అంతంత మాత్రంగానే ఉంది. జిల్లా కేంద్రంలోని ఏలూరు ఆర్ఆర్‌పేట, లంకపేట, ఎన్ఆర్‌పేటల్లో మూడు సచివాలయాల కేంద్రాలుగానే అప్పుడప్పుడు సేవలందిస్తున్నారు. గ్రామ,వార్డు, సచివాలయ వ్యవస్థలను పర్యవేక్షించే జడ్పీ ఉన్నతాధికారులు సైతం జిల్లా అంతటా ఆధార్ సేవలందించే అంశంపై అప్‌డేట్స్ ఇవ్వడం మొక్కుబడిగా సాగుతోంది. చిన్నారులు ఏడేళ్లు దాటితే బయోమెట్రిక్ ద్వారా తమ వివరాలను అప్‌లోడ్ చేయించుకోవాలి. ఈ మేరకు ఈనెల 8 నుంచి ఆధార్ సెంటర్ల ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే దీనిపై జిల్లా యంత్రాంగం ఏ మాత్రం ప్రచారం కల్పించడం లేదు. ఇక అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు 10 వేల మందికి పైగా ఆధార్ అప్‌డేట్ లేని వారు ఉన్నారు. ఈ శాఖ ద్వారా డేటా ఎంట్రీ చేయించుకోవడానికి అవకాశం ఉన్న ఆ దిశగా అడుగులు పడడం లేదు.

ఇంకెన్నాళ్లు!

(5వ పేజీ తరువాయి)

వేల్పుచర్ల గ్రామాల పరిధిలో సుమారు రెండు వేల ఎకరాలకు సాగు నీరు అందేది.

ప్రతిపాదనలు పంపినా : 2024 ఎన్నికల సమయంలో నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి ఈ చెక్‌డ్యామ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారంలోకి రాగానే నిర్మిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రావడం, సారథి మంత్రి కావడం జరిగింది. ఎన్నికల వేళ తాను ఇచ్చిన హామీని అమలు చేయడానికి మంత్రి సంబంధిత అధికారు లను ఈ ప్రాంతానికి పంపి ప్రతిపాదనలు తయా రు చేయించి సుమారు ఎనిమిది నెలలు అయింది. అయినా ఇంత వరకు ఈ చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. ఇది నిర్మాణం వల్ల బలివే, వేల్పుచర్ల గ్రామాల్లో చెరువులకు సప్లైయి ఛానల్ ద్వారా తమ్మిలేరు నుంచి నీరు చేరి, పంట పొలాలకు సమృద్ధిగా నీరు అందుతుంది. సమీప గ్రామాల్లో సైతం భూ గర్భజలాలు పెరిగి బోరుల కింద వ్యవసాయానికి ఉపయోగపడతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి చెక్‌డ్యామ్‌ను నిర్మించా లని రైతులు కోరుతున్నారు.

ముందుకు సాగని పెండింగ్ పనులు..

అదనపు తరగతి గదుల నిర్మాణం మొండి గోడలకే పరిమితం

లింగపాలెం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నిధుల కొరత, అధికారుల అలసత్వం వెరసి మండలంలోని పాఠశాలలు, ప్రభుత్వ భవనాలు అసంపూర్తి నిర్మాణాలతో మొండిగోడలుగా మిగిలాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ బడుల రూపు రేఖలు మార్చి కార్పొరేట్ స్థాయిలో విద్యార్థులకు మంచి చదువు అందిస్తామని గొప్పలు చెప్పుకుంది. నాడు-నేడులో భాగంగా ఫేజ్-2లో మండలంలో 14పాఠశాలలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల పనులను ఎంపిక చేసింది. ప్రతి పాఠశాలలో అదనపు గదులతో పాటు విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించాలని, వెంటనే ఆయా నిర్మాణాల పనులను వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కానీ క్షేత్ర స్థాయిలో మాత్రం కొన్ని పాఠశాలల్లో నిర్మాణాలు ఇప్పటికీ పూర్తికాక అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. అదనపు తరగతి గదుల పనులను ప్రారంభించిన కాంట్రాక్టర్లకు బిల్లులు మంజూరు చేయకపోవడంతో పాటు నిర్మాణ పనులకు ఇసుక లభించకపోవడంతో నిర్మాణ పనులు ముందుకు సాగలేదు. దీంతో మండలంలోని పలు పాఠశాలల్లో అదనపు గదులు, ఇతర నిర్మాణాల పనులు నేటికీ అసంపూర్తిగానే నిలిచిపోయాయి. కొన్ని పాఠశాలలో మరుగు దొడ్ల నిర్మాణ పనులు పూర్తికాలేదు. దీంతో విద్యార్థులు, మహిళా ఉపాధ్యాయులు అనేక అవస్థలు పడుతున్నారు. ఇవే కాకుండా కొన్ని గ్రామాల్లో ఆరేళ్ల క్రితం ప్రారంభించిన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్‌క్లినిక్ భవనాలు ఇప్పటికీ పూర్తికాకపోవడంతో ఆయా శాఖల అధికారులు ఇతర ప్రభుత్వ భవనాలు, చాలీచాలని ఇరుకు గదుల్లోనే కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని ఇబ్బందులు పడుతూనే విధులు నిర్వహిస్తున్నారు.


అసంపూర్తిగా ఉన్న తరగతి గదుల నిర్మాణం

అంటువ్యాధుల నివారణపై అవగాహన

ఏలూరు రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దోమల వృద్ధిని అరికట్టాలంటే ప్రతి ఒక్కరూ ఫ్రైడే డ్రైడేగా ఆచరించాలని అప్పుడే దోమల ద్వారా వచ్చే అంటువ్యాధుల నుంచి రక్షించుకోవచ్చని అసిస్టెంట్ మలేరియా అధికారి జె.గోవిందరావు తెలిపారు. ఏలూరు రూరల్ మండలం చాటపర్రు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ప్రదీప్ చంద్ర ఆధ్వర్యంలో మంగళవారం గ్రామంలో సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. అపరిశుభ్రత పరిసరాల వలన దోమలు ఎక్కువగా వృద్ధి చెంది తద్వారా ప్రాణాంతక వ్యాధులైన డెంగీ, మలేరియా, చికెన్ గునియా వ్యాధులు సోకే అవకాశం ఉందన్నారు. ఆరోగ్య విస్తరణ అధికారి రామాంజనేయులు, పబ్లిక్ హెల్త్ నర్స్ తులసీబాయి పాల్గొన్నారు.


జేసీకి మొక్క అందిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

జేసీని కలిసిన ఎమ్మెల్యే చిర్రి

జీలుగుమిల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మంగళవారం జేసీ ఎం.జె. అభిషేక్ గౌడను మర్యాద పూర్వకంగా కలిశారు. ఇటీవల నియోజకవర్గంలో పరిస్థితులు అభివృద్ధి ప్రభుత్వ పథకాల అమలు, పలు సేవా కార్యక్రమాలపై ఎమ్మెల్యే బాలరాజు జేసీతో చర్చించారు. జనసేన జిల్లా ప్రధాన కార్యదర్శి గడ్డమణుగు రవికుమార్, టీడీపీ సీనియర్ నాయకులు జయవరపు శ్రీరామూర్తి ఉన్నారు.

విగ్రహ ఏర్పాటు : జీలుగుమిల్లి మండల కేంద్రంలో గిరిజన ఉద్యమ నాయకుడు కొమరం భీం విగ్రహం ఈనెల 22న ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే చిర్రి బాలరాజు చెప్పారు. ఈ క్రమంలో మంగళవారం విగ్రహం ఏర్పాటు చేసే స్థలాన్ని గిరిజన నాయకులతో కలిసి పరిశీలించారు. బుధవారం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు అలివేరు ప్రాజెక్టు వద్ద సాగునీరు విడుదల, నూతన సచివాలయాలు, ఆర్ఎస్‌కే భవనాలు ప్రారంభం కార్యక్రమాల్లో పాల్గొంటారని తెలిపారు.


పోలవరంలో అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

సీపీఆర్‌పై వైద్యుల అవగాహన

పోలవరం, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అత్యవసర పరిస్థితుల్లో గుండెపోటు సమస్య తలెత్తితే సీపీఆర్ చేసి ఎలా ప్రాణాలు నిలపవచ్చనే అంశంపై మంగళవారం పోలవరం ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రం ఆవరణలో వైద్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ నెల 13నుంచి 17వ తేదీ వరకూ సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా అవగాహన కల్పించినట్టు వైద్యులు తెలిపారు. వైద్యులు కృష్ణంరాజు మాట్లాడుతూ గుండెనొప్పి వచ్చిన సందర్భాల్లో సీపీఆర్ చేస్తే ప్రాణాలు కాపాడవచ్చన్నారు.

● పెదపాడు: పెదపాడు మండలం వట్లూరులోని సీఆర్ రెడ్డి మహిళా కళాశాలలో విద్యార్థులకు ప్రథమ చికిత్సపై మంగళవారం అవగాహన కల్పించారు. కళాశాల బోటనీ, ఐక్యూఏసీ, రెడ్ క్రాస్‌ల ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి 17వ తేదీ వరకు జరిగే సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఫస్ట్ ఎయిడ్, ఏదైనా ప్రమాదం జరిగితే వెంటనే ప్రథమ చికిత్స చేయాలని రెడ్‌క్రాస్ ఏఎన్ఎం నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ప్రియాంక వివరించారు. రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ నాగరాజు, భాను ప్రకాశ్, సరళ, హిమబిందు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంలో విఫలం

ఏలూరుటూటౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికుల సమస్యలు పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.మున్సిపల్ కమిషనర్‌కు మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు.ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంటనే పీఆర్‌సీ ప్రకటించి 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలన్నారు. ఉద్యోగ విరమణ వయస్సు 62 సంవత్సరాలకు పెంచాలన్నారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో నవంబరు 3 నుంచి సమ్మె నిర్వహిస్తామన్నారు. నాగరాజు, వై.శివ కుమార్, బంగార్రాజు, సురేశ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణను విరమించుకోవాలి

ఏలూరుటూటౌన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నగరంలో పారిశుధ్య పనులు ప్రైవేటీకరిస్తే ప్రతిఘటిస్తామని ఏపీ మున్సిపల్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సోమయ్య అన్నారు. మున్సిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ధర్నా నిర్వహించారు.ఈ సందర్భంగా సోమయ్య మాట్లాడుతూ ప్రైవేటీకరణ కార్మికుల హక్కులకు భంగకరమన్నారు.ప్రైవేటీకరణతో కార్మికులు హక్కులు కోల్పోతారని ఇఫ్టూ ప్రధాన కార్యదర్శి వెంకట్రావు అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ భానుప్రతాప్ మాట్లాడుతూ 30, 11 డివిజన్లలో పారిశుధ్య పనులను ప్రైవేటీకరణ చేయలేదన్నారు. మెప్మా పట్టణ సమాఖ్య ద్వారా కార్మికులను నియమించామన్నారు. వీరికి కూడా కనీసవేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పిస్తామని కమిషనర్ హామీ ఇచ్చారు. ఇఫ్టూ సహాయ కార్యదర్శి వెంకటేశ్వరరావు, యూనియన్ అధ్యక్షులు ఎల్, కృష్ణారావు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ : రాష్ట్రంలో నగరపాలక సంస్థలు, పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో పని చేస్తున్న ఉద్యోగులు కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ నవంబరు 3 నుంచి సమ్మె నిర్వహిస్తున్నట్టు జోనల్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు బండి వెంకటేశ్వరరావు, రెడ్డి శ్రీనివాస్ డాంగే, అప్పలరాజు, తెలిపారు. ఈ మేరకు నగర పాలక సంస్థ కమిషనర్ ఏ.భానుప్రతాప్‌కు వినతిపత్రం సమర్పించారు.


చట్టాలపై అవగాహన అవసరం

పెదవేగి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ చట్టంపై అవగాహన కలిగి ఉండాలని, అప్పుడే సమస్యల నుంచి రక్షణ పొందే వీలుందని పెదవేగి సీఐ సి.హెచ్.రాజశేఖర్ అన్నారు.పెదవేగి మండలం కూచింపూడిలో చట్టాలపై చైతన్యం కల్పిస్తూ ప్రజలకు గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మహిళల రక్షణకు సంబంధించి పోక్సో వంటి ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు.ఇటీవల సైబర్ వలలో చిక్కుకుని నగదును కోల్పోతున్నారని అన్నారు. రానున్న దీపావళిని పురస్కరించుకుని బాణసంచా అక్రమ నిల్వలు, అనధికార విక్రయాలు వంటి సమాచారాన్ని తక్షణం డయల్ 112, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సెల్ నంబర్ 94407 96635కు సమాచారం అందించాలని ఆయన తెలిపారు. సమాచారం అందించినవారి వివరాలు గోప్యంగా ఉంచుతామని, నిందితులపై కఠిన చర్యలు ఉంటాయని సీఐ రాజశేఖర్ వివరించారు.

చురుగ్గా వంతెన నిర్మాణ పనులు

ఉంగుటూరు అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నారాయణపురం వంతెన నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని త్వరలో ప్రారంభించనున్నట్టు ఉంగుటూరు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు పేర్కొన్నారు. మంగళవారం నారాయణపురం వంతెన నిర్మాణ పనులను ఆయన స్వయంగా పరిశీలించి నిర్మాణ సిబ్బందికి, ఆర్ అండ్‌బీ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ వంతెన నిర్మాణం పూర్తయితే వాహనదారులకు సమస్య తీరుతుందన్నారు. ఆర్ అండ్‌బీ ఏఈ భాస్కర్, జనసేన, తెలుగుదేశం పార్టీల నాయకులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ తగ్గింపు


అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న సిబ్బంది

పెదవేగి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జీఎస్టీ తగ్గింపుతో భవన నిర్మాణ పనులు మరింత వేగం పుంజుకుంటాయని పెదవేగి ఎంపీడీవో రవికుమార్ అన్నారు. సూపర్ జీఎస్టీ-సూపర్ సేవింగ్స్‌లో కలిగే లాభాలపై నిర్వహిస్తున్న అవగాహనలో భాగంగా పెదవేగిలోని సిమెంట్ దుకాణంలో ఇంటి నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ తగ్గింపు అంశాలను వివరించారు. ఎంపీడీవో మాట్లాడుతూ జీఎస్టీ తగ్గింపు దాదాపు అన్నిరకాల వస్తువులు, సామగ్రిపై ఉందన్నారు. సిమెంట్, ఇనుము వంటి వాటిపై జీఎస్టీ తగ్గింపుతో గృహ నిర్మాణ రంగం వేగం పుంజుకుందన్నారు. ఈవో పీఆర్డీ షరీఫ్, ఎంపీడీవో కార్యాలయ జూనియర్ అసి స్టెంట్ అల్లీ సాహెబ్, పెదవేగి కార్యదర్శి కె.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

● టి.నర్సాపురం: జీఎస్టీ తగ్గింపుతో అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని మండల ప్రజాపరిషత్ అధికారిణి జి.మణికుమారి తెలిపారు. సూపర్ జీఎస్టీ, సూపర్ సేవింగ్స్‌లో భాగంగా ఎంపీడీఓ మణికుమారి ఆధ్వర్యంలో స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సెంటర్ వరకు మంగళవారం ర్యాలీ నిర్వహించారు. జీఎస్టీ తగ్గింపుతో వినియోగదారులకు 5వేల నుంచి 15వేల వరకు లబ్ధి చేకూరుతుందన్నారు.భవన నిర్మాణ సామగ్రిపై జీఎస్టీ తగ్గించడంతో అభివృద్ధి చెందుతున్న మధ్యతరగతికి ఉపశమనం కలుగుతుందన్నారు. పంచాయతీ రాజ్ ఏఈ సంపత్ కుమారి, ఏపీవో నాగేశ్వరరావు, శేఖర్ బాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు ప్రొటోకాల్ పాటించాలి : ఎస్సీ సర్పంచ్‌ల సంఘం

ఏలూరు రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):గ్రామ పంచాయతీలలో అధికారులు, కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించడం లేదని,అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలంటూ ఆంధ్రప్రదేశ్ ఎస్సీ సర్పంచ్‌ల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ మెండెం సంతోశ్ కుమార్ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ వెట్రి సెల్వికి కలిసి వినతిపత్రం అందజేశారు. సంతోశ్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో కార్యదర్శులు ప్రొటోకాల్ పాటించడం లేదని, సర్పంచ్‌లకు తెలియకుండానే ప్రైవేటు వ్యక్తులు పంచాయతీల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, ఇది 1994 పంచాయతీరాజ్ చట్టానికి విరుద్ధమన్నారు. దెందులూరు నియోజకవర్గంలో పోతునూరు పంచాయతీ సర్పంచ్ బొదుల స్వరూప్‌కు తెలియకుండా అధికారులు చెప్పకుండా ఒక దాత ఇచ్చిన డబ్బులతో ఆ గ్రామంలో ఆరోగ్య కేంద్రం భవనాన్ని ఈ నెల 6న ప్రారంభించారన్నారు. ఆ భవనంలో ప్రారంభ శిలాఫలకంపై సర్పంచ్ పేరు వేయకపోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఎస్సీ సర్పంచ్‌లన్న చిన్నచూపుతో అధికారులు చట్ట వ్యతిరేకంగా పనిచేస్తున్నారని ఇది మంచి సంప్రదాయం కాదన్నారు. ప్రొటోకాల్ విషయంలో కలెక్టర్ ఆదేశాలు ఇచ్చినప్పటికీ కార్యదర్శులు పాటించడం లేదన్నారు. అలాంటి కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


స్వామి చిత్ర పటం, ఆశీస్సులు అందుకుంటున్న ఎమ్మెల్యేలు చింతమనేని, చంటి

మోదీ పర్యటన ఏర్పాట్లపై ఎమ్మెల్యేల సమీక్ష

పెదవేగి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర సమగ్రాభివృద్ధి దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తోందని దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. ప్రధాని మోదీ ఈ నెల 16న శ్రీశైలం పర్యటన నేపథ్యంలో మంగళవారం ఉదయం శ్రీశైలం చేరుకున్న ఎమ్మెల్యే ప్రభాకర్.. రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, పయ్యావుల కేశవ్, టీడీపీ సీనియర్ నాయకుడు కిలారు రాజేశ్‌లతో కలిసి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 16న జరిగే ప్రధాని పర్యటనతో రాష్ట్రానికి మరింత మేలు జరిగే పథకాలు అందుతాయనే విశ్వాసం ఉందన్నారు. కేవలం 16 నెలల్లోనే రాష్ట్రంలో రూ.11.20 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయని, ఇది ఆంధ్రప్రదేశ్‌కు సువర్ణాధ్యాయమన్నారు. తొలుత మంత్రులతో కలిసి శ్రీశైలంలో సాక్షి గణపతిని దర్శించుకున్నారు. ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన అర్చకులు స్వామి దర్శనానంతరం స్వామివారి చిత్రపటం, శేషవస్త్రం, తీర్థప్రసాదాలు ఇచ్చి, వేదాశీర్వచనం అందించారు.

● ఏలూరుకార్పొరేషన్: ప్రధాని మోదీ పర్యటన నేపథ్యంలో కర్నూలు జిల్లా పరిశీలకుడిగా వెళ్లిన ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి బృందం సోమవారం మహానంది క్షేత్రాన్ని దర్శించుకుంది. ఎమ్మెల్యే వెంట కూటమి నాయకులు కంప్యూటర్ ప్రసాద్, బెల్లంకొండ కిశోర్ ఉన్నారు.

● ఏలూరుటూటౌన్: ప్రధాని మోదీ సభ ఏర్పాట్ల నిమిత్తం ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి కర్నూలు వెళ్లి మంత్రులు, ఎమ్మెల్యేల సమీక్షలో పాల్గొన్నారు. స్థానిక ఎమ్మెల్యే చరితారెడ్డి నివాసంలో సమావేశం జరిగింది. మంత్రులు ఎన్ఎండీ ఫరూక్ బీసీ జనార్దన్, నారాయణ, గొట్టిపాటి రవి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, శాప్ చైర్మన్ రవినాయుడు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పంటలను ఇ-క్రాప్‌లో నమోదు చేయాలి

దెందులూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలో రైతులు తమ పంటలను ఇ-క్రాప్‌లో నమెదు చేయించుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజు అన్నారు. మంగళవారం మండలంలోని దెందులూరు, గోపన్నపాలెం, గాలాయగూడెం, కొవ్వలితో పాటు ఆయా గ్రామాల్లో ఇ-పంట క్రాప్ నమోదుపై శ్రీనివాసరాజు పర్యవేక్షించారు. రైతులు వేసిన పంటలు నమోదు చేయించడం రైతులకు ప్రకృతి, విపత్తుల సమయంలో ఉపయోగపడుతుందన్నారు.


● లింగపాలెం: ప్రభుత్వం అందించే సంక్షేమపథకాలు అందాలన్నా, పండిన పంటను ప్రభుత్వకొనుగోలు కేంద్రాల్లో మద్దతుధర దక్కాలన్నా ఇ-క్రాప్ నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని మండల వ్యవసాయాధికారి వి ప్రదీప్ కుమార్ తెలిపారు. మండలంలోని 2,156 మంది రైతులు 6,856 ఎకరాల్లో వరి పంటను సాగు చేసినట్టు తెలిపారు. ఈ వివరాలన్నీ ఇ-పంటలో నమోదు చేశామని తెలిపారు. వివరాలు ఇ-పంటలో నమోదు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 25వ తేదీ వరకు గడువు పెంచిందన్నారు. పంటల వివరాలు ఈ-కర్షక్ పోర్టల్‌లో నమోదైతేనే ప్రభుత్వ ప్రయోజనాలు అందుతాయన్నారు.


వినికిడి యంత్రాలు అందుకున్న విద్యార్థులు

విద్యార్థులకు వినికిడి పరికరాల పంపిణీ

ఏలూరు రూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దివంగత గోవింద రాజులు స్వామి జ్ఞాపకార్థం ఆయన సతీమణి డాక్టర్ భారతి దొండపాడులోని 11 మందికి వినికిడి యంత్రాలను పంపిణీ చేసింది. భారతి అమెరికాలో నివాసం ఉంటున్నారు. మానవతా దృక్పథంతో వినికిడి లోపం ఉన్న పిల్లలకు మంగళవారం పరివర్తనలో ఈ యంత్రాలను అందజేశారు. ఏలూరు ఆర్డీవో డాక్టర్ అచ్యుత అంబరీశ్, విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సహాయ సంచాలకులు బి.రామ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొని విద్యార్థులకు వినికిడి యంత్రాలు అందజేశారు. ఆర్డీవో మాట్లాడుతూ పుట్టిన ఊరిపై మమకారంతో డాక్టర్ భారతి దివ్యాంగ పిల్లల అవసరాలను గుర్తించి సాయం చేయడం అభినందనీయమన్నారు. పాఠశాల ప్రిన్సిపాల్ డి.శ్రీనివాస్‌రెడ్డి, కలపాల మురళీకృష్ణ పాల్గొన్నారు.

సుధాకర్‌కు సర్వేపల్లి అవార్డు



పెదపాడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): రామచంద్ర ఇంజనీరింగ్ కళాశాలలో ఏఐ అండ్ డీఎస్ హెచ్‌వోడీగా విధులు నిర్వహిస్తున్న డాక్టరు పి.సుధాకర్‌కు డాక్టరు సర్వేపల్లి రాధాకృష్ణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు - 2025 లభించినట్టు కళాశాల ఎండీ కె.సాయిరోహిత్ తెలిపారు. సొసైటీ ఫర్ లెర్నింగ్ టెక్నాలజీ ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన అధ్యాపకులు 2 వేల మంది పాల్గొనగా, వారిలో డాక్టరు సుధాకర్ అవార్డు పొందడం సంతోషకరమన్నారు. విజయవాడలో జరిగిన కార్యక్రమంలో మినిస్ట్రీ ఆఫ్ ఎడ్యుకేషన్ అండ్ చీఫ్ కో-ఆర్డినేటర్, సీఈవో డాక్టరు బుద్ధా చంద్రశేఖర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకున్నారు. అవార్డు పొందిన సుధాకర్‌ను ప్రిన్సిపాల్ ఎం.మురళీధర్, హెచ్‌వోడీలు అభినందించారు.

భక్తి శ్రద్ధలతో అయ్యప్ప పడిపూజ

దెందులూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అయ్యప్ప భజనలు,పడిపూజలు పెద్ద ఎత్తున జరిగాయి. పాలగూడెంలో లారీల సరఫరా సంస్థ అధినేత కలగర నాని స్వామి నివాసంలో అయ్యప్పపడిపూజను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కొబ్బరి డొప్పలతో ప్రత్యేకంగా అయ్యప్ప ఆలయ నమూనాతో ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం దీక్షధారులకు భిక్షను అందజేశారు. గురుస్వామి మల్లవరపు రంగారావు, గుళ్లపూడి వెంకటేశ్వరరావుతో పాటు అయ్యప్ప మాలధారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఎరువుల నిల్వల తనిఖీ

దెందులూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఎరువుల గొడౌన్‌లలో విజిలెన్స్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. మంగళవారం దెందులూరు సొసైటీ గొడౌన్‌లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఏవో మీరయ్య, వ్యవసాయ శాఖ అధికారి ఎల్.శ్రీనివాసరాజుల బృందం తనిఖీ నిర్వహించి వివిధ రకాల ఎరువుల స్టాక్ లెవల్స్, అమ్మకపు రికార్డులు, బిల్లులు, ధరలను పరిశీలించారు. ఎలాంటి అవకతవకలు లభించలేదని వారు తెలిపారు. తనిఖీల్లో విజిలెన్స్ కానిస్టేబుల్‌లు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే చింతమనేనికి ఆహ్వానం

దెందులూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): నాయీ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 18న ఏలూరులోని శుభలేఖ కల్యాణ మండపంలో జరిగే శ్రీ ధన్వంతరి జయంతి ఉత్సవాలకు దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌ను నాయీ బ్రాహ్మణ సాధికార సంఘం ఆహ్వానించింది. మంగళవారం దెందులూరు ఎమ్మెల్యే చింతమనేని క్యాంప్ కార్యాలయంలో చింతమనేని అందుబాటులో లేకపోవడంతో ఆయన సోదరుడు విష్ణుకు ఆహ్వాన పత్రికను అందించినట్టు నియోజకవర్గ నాయీ బ్రాహ్మణ సాధికార సంఘం అధ్యక్షులు కొప్పక వెంకటేశ్వరరావు(కొండ), జిల్లా కార్యదర్శి సత్యనారాయణ, కొక్కిరిపాటి సురేశ్, కోసూరి సతీశ్ కుమార్, కొండపావులూరి వెంకట్ ఉన్నారు.

కాపునాడు సేవా సమితి నగర అధ్యక్షుడిగా శేషు



ఏలూరురూరల్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): కాపుల అభ్యున్నతికి వారి సంక్షేమానికి కృషి చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపునాడు సేవా సమితి ఏలూరు నియోజకవర్గ ప్రముఖ కాపు నాయకుడు పసుపులేటి శేషు అన్నారు. కాపు నాడు సేవా సమితి ఏలూరు నియోజకవర్గం అధ్యక్షుడిగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాపు నాడు సేవా సమితి జాతీయ అధ్యక్షుడు మల్లెల శివ నాగే శ్వరరావు నియమిస్తూ నియామక పత్రం అం దజేశారు. ఈసందర్భంగా శేషు మాట్లాడుతూ కాపు సామాజికవర్గం అభివృద్ధికి వారి హక్కుల సాధన కోసం, సంఘ అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

ఘనంగా శతచండీ యాగం

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): శ్రీకన్యకాపరమేశ్వరి అమ్మవారి సత్రం ఆధ్వర్యంలో అగ్రహారంలోని నగరేశ్వర స్వామి ఆలయం వద్ద సోమవారం నుంచి జరుగుతున్న అష్టోత్తర శతచండీయాగం మంగళవారం ఘనంగా నిర్వహించారు. డాక్టర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అయినవిల్లి మండలం ముక్తేశ్వరానికి చెందిన వేద పండితులు బ్రహ్మశ్రీ అల్లవరపు సుబ్రహ్మణ్య దీక్షితావధాని బృందం ఆర్యవైశ్య భక్త బృందంతో కన్యకా పరమేశ్వరి అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలు జరిపించారు. ఈ నెల 17వ తేదీ వరకు చండీయాగాలు కొనసాగుతాయని ఆలయ అర్చకులు చెరుకూరి వి.డి. మల్లికార్జునరావు(నాని), ఆలయ కార్యనిర్వాహణాధికారి నాగబాబు తెలిపారు.

హుండీ ఆదాయం లెక్కింపు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): దేవదాయ శాఖ అధికారుల పర్యవేక్షణలో మంగళవారం పత్తేబాదలోని కనకదుర్గమ్మ ఆలయ హుండీని లెక్కించగా 62రోజులకు గాను లక్ష 72వేల 154రూపాయలు ఆదాయం లభించినట్టు ఆలయ ఈవో నల్లూరి సతీశ్ కుమార్, ధర్మకర్తల మండలి చైర్మన్ పృథ్వీ సత్యనారాయణ మూర్తిలు తెలిపారు. లెక్కింపు ప్రక్రియలో భక్తులు, ధర్మకర్తలు పాల్గొన్నారు.


ఎమ్మెల్యేకు మొక్క అందజేస్తున్న అమ్మాజీ

ఉంగుటూరు మండల ప్రత్యేకాధికారిణిగా అమ్మాజీ

ఉంగుటూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఏలూరు డీఎల్‌పీవోగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన వై.అమ్మాజీ ఉంగుటూరు మండల ప్రత్యేక అధికారిణిగా నియమితులయ్యారు. ఈ నేపథ్యంలో ఆమె ఉంగుటూరు నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే ధర్మరాజును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ధర్మరాజు మండలంలో చేపట్టాల్సిన పలు అభివృద్ధి పనులు, నిధుల సద్వినియోగం, విజన్-2047, పి4 వంటి కార్యక్రమాల గురించి సమీక్షించారు.

వీరాంజనేయుడికి అర్చనలు

ఏలూరుకార్పొరేషన్, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆశ్వీయుజ మాసంలోని మంగళవారం కావడంతో సత్రంపాడులోని అంబికాదేవి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని శ్రీవీరాంజనేయ స్వామి ఆలయం వద్ద ప్రధాన అర్చకులు వారణాసి రాఘవేంద్రశర్మ ఆధ్వర్యంలో అర్చనలు జరిపారు.

అనుమతులు లేకుండా బాణసంచా విక్రయిస్తే చర్యలు : సీఐ

కైకలూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో అనుమతులు లేకుండా నిల్వ ఉన్న దీపావళి మందుగుండు సామగ్రిని విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కైకలూరు రూరల్ సీఐ వి రవికుమార్ అన్నారు. మంగళవారం కైకలూరు సర్కిల్ కార్యాలయంలో మహిళా పోలీసులతో సమావేశాన్ని నిర్వహించారు. దీపావళి సందర్భంగా ఎవరైనా మందుగుండు సామగ్రి అనుమ తులు లేకుండా డంప్ చేసినా, విక్రయాలు చేసినా సమాచారాన్ని వెంటనే అందించాలని సూచించారు. ప్రతీ గ్రామంలోనూ బాణసంచా విక్రయ దుకాణాల వద్ద ఏర్పాట్లను పరిశీలించాలన్నారు.

అటవీ భూమిని చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్ స్వాధీనం

చాట్రాయి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోటపాడు ఫారెస్ట్ పరిధిలోని చీపురుగూడెంలో సోమవారం రాత్రి అక్రమంగా అటవీ భూమి చదును చేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను స్వాధీనం చేసుకున్నామని నూజివీడు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణ తెలిపారు. దీనిపై డీఎఫ్‌వోకి నివేదిక పంపామని, అటవీ భూములు ఆక్రమణకు ప్రయత్నించే వారిపై కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని రేంజ్ ఆఫీసర్ సత్యనారాయణ హెచ్చరించారు.

సూపర్ జీఎస్టీపై అవగాహన చేపట్టాలి : సబ్ కలెక్టర్



మాట్లాడుతున్న నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న

నూజివీడు/కైకలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం తాజాగా అమలు పరుస్తున్న సూపర్ జీఎస్టీ 2.0పై విస్తృత అవగాహన కార్యక్రమం చేపట్టాలని నూజివీడు సబ్‌కలెక్టర్ వినూత్న సూచించారు. నూజివీడు ఎంపీడీవో కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం భవననిర్మాణ వస్తువులపై 'జీఎస్టీ, సూపర్‌సేవింగ్స్' అనే అంశంపై బిల్డింగ్ కాంట్రాక్టర్లకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సూపర్ జీఎస్టీ 2.0ను కేంద్రప్రభుత్వం సెప్టెంబరు 22 నుంచి అమల్లోకి తీసుకువచ్చిందన్నారు. సాధారణ ప్రజలు ఒక ఇంటిని కట్టుకోవాలంటే దాదాపు రూ.ఏడున్నర లక్షల వరకు ఖర్చు అయ్యేదని, తాజాగా అమల్లోకి వచ్చిన సూపర్ జీఎస్టీతో రూ.60వేల వరకు ఆదా అవుతోందన్నారు. ఎంపీడీవో చెన్నా రాఘవేంద్రనాథ్, నూజివీడు మండల టీడీపీ అధ్యక్షుడు యనయదల శ్రీనివాసరావు, ఏలూరు జిల్లా సీఐటీయూ కార్యవర్గ సభ్యులు జి.రాజు తదితరులు పాల్గొన్నారు.

కైకలూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద..

జీఎస్టీ 2.0 తగ్గుదలతో భవన నిర్మాణ సామగ్రికి భారీగా ధరలు తగ్గాయని ఎంపీపీ అడవి కృష్ణ అన్నారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం వద్ద జీఎస్టీ 2.0పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎంపీడీవో కె.రాజబాబు, పంచాయతీ కార్యదర్శిలు తదితరులు పాల్గొన్నారు.

'కౌలు రైతులకు అన్నదాత సుఖీభవ లబ్ధి ఇవ్వాలి'

ముదినేపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పథకం లబ్ధిని కౌలు రైతులకు వర్తింప జేయాలని కౌలు రైతులు ధర్నా నిర్వహించారు. మంగళవారం ముదినేపల్లి మండల తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టి, డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్‌కు కౌలు రైతులు వినతి పత్రం అందజేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శేషపు మహంకాళిరావు, ముదినేపల్లి మం డల సంఘ నాయకులు చిన్నం మాధవ, జక్కుల మహేష్, బొంతు మల్లికార్జు నరావు నాయకత్వంలో మండలంలోని కౌలు రైతులు ధర్నాలో పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాల ఫలితాలు భూయజమానులకే దక్కుతున్నాయని, కౌలు రైతులకు రాయితీలు అందడం లేదని సంఘ జిల్లా సహాయ కార్యదర్శి మహంకాళిరావు అన్నారు.


చేవూరులో దళితుల రాస్తారోకో.. లారీకి అడ్డుగా పడుకున్న ముంపు బాధితుడు

చెరువుల వృథా నీటి సమస్యపై దళితుల రాస్తారోకో

ముదినేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): గ్రామం పక్కనే తవ్విన చేపల చెరువుల నుంచి వస్తున్న వృథానీటి వల్ల ఏర్పడుతున్న సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని డిమాండ్ చేస్తూ చేవూరు గ్రామ దళితులు ఆందోళన చేపట్టారు. వృథానీరు గ్రామ దళితవాడలోని కాలనీలను ముంపునకు గురి చేస్తుందని మంగళవారం సింగరాయపాలెం-మచిలీపట్నం ప్రధాన రహదారిపై బైఠాయించి దళితులు రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. చెరువుల నుంచి మురుగునీరు బయటికి పోయేందుకు యజమానులు వూట బోదెలు ఏర్పాటు చేయక పోవటం వల్ల దళితవాడలోని ఇళ్ల ఆవరణలు ముంపునకు గురవుతున్నాయని జిల్లా, మండల స్థాయి అధికారులకు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఫిర్యాదు చేశామన్నారు. తహసీల్దార్ రావాలి అంటూ నినాదాలు చేశారు. సమాచారం తెలుసుకున్న ఏఎస్‌ఐ పద్మజ చేవూరు వచ్చి సమస్యను తెలుసుకుని తహసీల్దార్ లతీఫ్ పాషాతో ఫోన్‌లో మాట్లాడారు. బుధవారం తహసీల్దార్ వచ్చి పరిశీలిస్తారని ఏఎస్‌ఐకి తెలియజేయడంతో రాస్తారోకో విరమించారు.

నాగుల చవితి ఉత్సవాలు ప్రారంభం

ముదినేపల్లి,అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): పెదగొన్నూరు శివారు ఉప్పరగూడెంలో నాగుల చవితి ఉత్సవాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ప్రత్యేకంగా నిర్మించిన మంటపంలో వరి మొక్కతో పాటు గౌరీదేవికి పూజలు చేసిన అనంతరం పార్వతీ పరమేశ్వరుల విగ్రహాలను ప్రతిష్ఠించారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు నచ్చిరెడ్డి వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో స్వామి వార్లకు గ్రామస్థులు పూజలు జరిపారు. ఈనెల 28న నాగులచవితి పండుగ వరకు ఉత్సవాలు జరుపుతామన్నారు. కోదండ రామాలయ కమిటీ అధ్యక్షుడు బండారు పాండురంగారావు, ఆంజనేయస్వామి దేవస్థానం అధ్యక్షుడు రెడ్డి నాగరమేష్, నచ్చిరెడ్డి శ్రీనివాసరావు, రాగాల రమేష్, పాల్గొన్నారు.

ఇంకెన్నాళ్లు !

(5వ పేజీ తరువాయి)

వేల్పుచర్ల గ్రామాల పరిధిలో సుమారు రెండు వేల ఎకరాలకు సాగు నీరు అందేది.

ప్రతిపాదనలు పంపినా..

2024 ఎన్నికల సమయంలో నూజివీడు టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథి ఈ చెక్‌డ్యామ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించి, అధికారంలోకి రాగానే నిర్మిస్తామని రైతులకు హామీ ఇచ్చారు. టీడీపీ అధికారంలోకి రావడం, సారథి మంత్రి కావడం జరిగింది. ఎన్నికల వేళ తాను ఇచ్చిన హామీని అమలు చేయడానికి మంత్రి సంబంధిత అధికారు లను ఈ ప్రాంతానికి పంపి ప్రతిపాదనలు తయా రు చేయించి సుమారు ఎనిమిది నెలలు అయింది. అయినా ఇంత వరకు ఈ చెక్‌డ్యామ్ నిర్మాణానికి ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు కాలేదు. ఇది నిర్మాణం వల్ల బలివే, వేల్పుచర్ల గ్రామాల్లో చెరువులకు సప్లైయి ఛానల్ ద్వారా తమ్మిలేరు నుంచి నీరు చేరి, పంట పొలాలకు సమృద్ధిగా నీరు అందుతుంది. సమీప గ్రామాల్లో సైతం భూ గర్భజలాలు పెరిగి బోరుల కింద వ్యవసాయానికి ఉపయోగపడతాయి. ఇప్పటికైనా ప్రభుత్వం నిధులు మంజూరు చేసి చెక్‌డ్యామ్‌ను నిర్మించా లని రైతులు కోరుతున్నారు.

17 ఏళ్లలోపు వారికి..ఆధార్ నవీకరణ ఉచితం

(5వ పేజీ తరువాయి)

కార్డుల జారీకి దరఖాస్తులు రావడం, వాటిని నవీకరణకు పంపడం చేస్తున్నట్టు పోస్టల్‌శాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇటీవల ఏలూరులో ప్రత్యేక శిబిరాలను నిర్వహించారు.

తూతూమంత్రంగా కేంద్రాల నిర్వహణ

ఆధార్ కేంద్రాల నిర్వహణపై ఏ శాఖ నుంచి కూడా ప్రజలకు సరైన సమాచారం అందివ్వకపోగా, ప్రచారం కల్పన కూడా అంతంత మాత్రంగానే ఉంది. జిల్లా కేంద్రంలోని ఏలూరు ఆర్ఆర్‌పేట, లంకపేట, ఎన్ఆర్‌పేటల్లో మూడు సచివాలయాల కేంద్రాలుగానే అప్పుడప్పుడు సేవలందిస్తున్నారు. గ్రామ,వార్డు, సచివాలయ వ్యవస్థలను పర్యవేక్షించే జడ్పీ ఉన్నతాధికారులు సైతం జిల్లా అంతటా ఆధార్ సేవలందించే అంశంపై అప్‌డేట్స్ ఇవ్వడం మొక్కుబడిగా సాగుతోంది. చిన్నారులు ఏడేళ్లు దాటితే బయోమెట్రిక్ ద్వారా తమ వివరాలను అప్‌లోడ్ చేయించుకోవాలి. ఈ మేరకు ఈనెల 8 నుంచి ఆధార్ సెంటర్ల ద్వారా అప్‌లోడ్ చేస్తున్నారు. అయితే దీనిపై జిల్లా యంత్రాంగం ఏ మాత్రం ప్రచారం కల్పించడం లేదు. ఇక అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారులు 10 వేల మందికి పైగా ఆధార్ అప్‌డేట్ లేని వారు ఉన్నారు. ఈ శాఖ ద్వారా డేటా ఎంట్రీ చేయించుకోవడానికి అవకాశం ఉన్న ఆ దిశగా అడుగులు పడడం లేదు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	130, 139, 150
చికెన్ విత్ స్కిన్	248
చికెన్ స్కిన్‌లెస్	258
నెక్ కోడి గుడ్డు ధర (100)	
విజయవాడ జోన్ రైతు ధర రూ.475	

కొల్లేరుకు విదేశీ అతిథులు


కృత్రిమ స్టాండులపై సేదతీరుతున్న పక్షులు



వలస పక్షుల రాకతో సందడి

కైకలూరు, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): ప్రతీ సంవత్సరం ఇంటికి బంధువులు వచ్చినట్లుగానే ఈ సంవత్సరం కొల్లేరుకు విదేశీ అతిథులు రాక ప్రారంభమైంది. ఈ సంవత్సరం సమృద్ధిగా వర్షాలు పడడంతో కొల్లేరు సరస్సు నిండుకుండలా మారింది. పక్షులకు స్వర్గధామంగా మారింది. నీటితో పాటు విదేశీ పక్షులకు సమృద్ధిగా ఆహారం లభిస్తుంది. ఇప్పటికే విదేశాల నుంచి పక్షులు వచ్చి సంతానోత్పత్తికి గూళ్ల నిర్మాణం ప్రారంభించాయి. మంచినీటి సరస్సుగా పేరొందిన కొల్లేరుకు ప్రతి సంవత్సరం వివిధ జాతులకు చెందిన పక్షులు వేల కిలోమీటర్లు ప్రయాణించి చేరుతుంటాయి. 77,136 ఎకరాల్లో విస్తరించి ఉన్న కొల్లేరు సరస్సు అనేక జీవ జాతులకు ఆలవాలం. కెనడా, సైబీరియా, ఆస్ట్రేలియా తీరప్రాంతాల నుంచి వేల కిలోమీటర్లు ప్రయాణించి వలసవచ్చిన వివిధ రకాల పక్షులు కొల్లేరు శీతాకాలపు అతిథులుగా పర్యాటకులను ఆకర్షిస్తాయి. ఇప్పటికే వేలాది పక్షులు తరలిరావడంతో ఆటపాక పక్షుల కేంద్రం పక్షుల కిలకిల రావాలతో పర్యాటకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. కొల్లేరు సరస్సులో చేపలను వేటాడి ఆహారాన్ని సంపాదిస్తున్న తీరు అబ్బుర పరుస్తుంది. ఆడ, మగ పక్షులు జతకట్టి సమీప ప్రాంతాల నుంచి పుల్లలు ఎరుకుని గూళ్లు కట్టుకుంటున్నాయి. పెయింటెడ్ స్టాక్, పెలికాన్‌తో పాటు ఎర్రకాళ్ళ ఉలసలు, తెల్ల, నల్ల కంకణాల పిట్టలు, జనకబాతులు, నీటికోళ్ళు, ఊది చెంచుకోడి, పెద్ద ఉల్లంకి పక్షులు సంతానోత్పత్తి చేసుకునేందుకు కొల్లేరు సరస్సు అనువైన ప్రదేశం. ఇప్పటికే పక్షులు వలస వచ్చి సంతానోత్పత్తి చేసుకున్నాయి.

ముళ్లచెట్లపై సేదతీరుతున్న పెయింటెడ్ స్టాక్



కేసరపల్లి మైనర్‌పై సాగర్‌జలాల వద్ద నీటిసంఘాల ప్రతినిధులు

ఎడమ కాలువ మూడోజోన్‌కు సాగర్ జలాలు

నూజివీడు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):అవరోధాలు దాటి నాగార్జునసాగర్ ఎడమకాలువ మూడో జోన్‌కు సాగర్‌జలాలు చేరుకున్నాయని ఎన్ఎస్‌పీ ఎడమకాలువ ప్రాజెక్ట్ కమిటీ వైస్ ఛైర్మన్ ఆళ్ల వెంకటగోపాలకృష్ణ అన్నారు. కొమ్మూరు గ్రామంలో కేసరపల్లి మైనర్ 6వ కిలోమీటర్ రెగ్యులేటర్ నుంచి కొమ్మూరు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌కు సాగర్‌జలాల విడుదలను స్థానిక నీటిసంఘాల సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాగార్జున సాగర్ డ్యామ్‌నుంచి 290 కిలోమీటర్లు ప్రయాణించి ఎన్నో అవరోధాలను దాటి సాగర్ వరద జలాలు వస్తున్నాయన్నారు. బండారుగూడెం, గన్నవరం, నీటిసంఘాల పరిధిలో తాగునీటి చెరువులను ఇంకా నీటిని నింపాల్సి ఉందని, పైన పేర్కొన్న ఆయ కట్టుదారులు అండర్ టన్నెల్ దగ్గర నీటివృథాను అరికట్టి ఆయకట్టు చివరి ప్రాంతానికి సాగర్‌జలాలు రావడానికి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. నీటి సంఘం ఉపాధ్యక్షుడు బొడ్డు శ్రీనివాసరావు, ఎన్ఎస్‌పీ డీఈ సీతారావమ్మ, మల్లవల్లి నీటిసంఘం అధ్యక్షుడు తమ్మిశెట్టి రాంబాబు, ఆయకట్టుదారులు కాకాని సతీష్, గుండపనేని కిషోర్ పాల్గొన్నారు.


కైకలూరు రైల్వేస్టేషన్లో తనిఖీలు నిర్వహిస్తున్న పోలీసులు

డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు

కైకలూరు, అక్టో బరు 14 (ఆంధ్రజ్యోతి): భద్రతా చర్యల్లో భాగంగా ముందస్తుగా ఎక్కడికక్కడ ఆకస్మికంగా డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు కైకలూరు టౌన్ ఎస్ఐ ఆర్.శ్రీను అన్నారు. మంగళవారం కైకలూరు పట్టణంలోని బస్టాండ్, రైల్వేస్టేషన్, దేవాలయాలు, మసీదు సెంటర్, లాడ్జిలు, సినిమా హాళ్ళు, తదితర రద్దీ ప్రదేశాల్లో ఏలూరు నుంచి వచ్చిన డాగ్‌స్క్వాడ్‌తో తనిఖీలు చేపట్టారు. అనంతరం రహదారులపై ఆటోల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడు తుందని ఆటోయూనియన్ సభ్యులకు పోలీస్ స్టేషన్లో కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఏఎంసీ మాజీ చైర్మన్ సుబ్బారావు మృతి


సుబ్బారావు (ఫైల్)

కలిదిండి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి): కలిదిండికి చెందిన ఏఎంసీ మాజీ చైర్మన్ గొరిపర్తి సుబ్బారావు(83) మంగళవారం తెల్లవారు జామున గుండెపోటుతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రొండి కృష్ణయాదవ్, మాజీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు, మాజీ జడ్పీటీసీ నున్న రమాదేవి, టీడీపీ మండల అధ్యక్షుడు పోకల జోగిరాజు, డీసీ చైర్మన్ ముద్దం భోగేశ్వరరావు, ఏఎంసీ మాజీ చైర్మన్లు వల్లభనేని శ్రీనివాస్ చౌదరి, నున్న వెంకటేశ్వరరావు, చేబోయిన వీర్రాజు, నీలపాల వెంకటేశ్వరరావు, నియోజకవర్గ యాదవ సంఘం అధ్యక్షుడు కర్రేటి శ్రీహరి, టీకేఎం.నాని, మాజీ సర్పంచ్ నున్న భగవాన్‌లు, సొసైటీ మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ రవికుమార్, కలిదిండి సర్పంచ్ మసిముక్కు మారుతి ప్రసన్న తదితరులు సుబ్బారావు భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులర్పించారు.

పోటాపోటీగా కొత్త టీచర్ల సభ్యత్వాల నమోదు

ముదినేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలల్లో నూతనంగా చేరిన ఉపాధ్యాయులకు తమ యూనియన్లలో సభ్యత్వం కల్పించేందుకు ఏపీటీఎఫ్, యూటీఎఫ్, ఎస్టీయూ నాయకులు పోటా పోటీగా రంగంలోకి దిగారు. కొత్త ఉపాధ్యాయులు జాయినింగ్ ఆర్డర్లు తీసుకున్న మరుక్షణమే యూనియన్ నాయకులు వారికి తమ యూనియన్ల తరపున సర్వీస్ రిజిస్టర్లు అందజేసేందుకు సిద్ధమయ్యారు. ముదినేపల్లి మండలంలో కొత్తగా 38 మంది ఉపాధ్యాయులు విధుల్లో చేరగా రెండు రోజులుగా అందరికీ యూనియన్ల సభ్యత్వాలను నమోదు చేయడం పూర్తి చేశారు.

చర్చి నిర్మాణానికి సిమెంట్, ఇసుక వితరణ

ఆగిరిపల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి):మండలంలోని నరసింగపాలెం గ్రామంలో చర్చి నిర్మాణం కోసం అవసరమైన సామగ్రిని రాష్ట్ర మంత్రి కొలుసు పార్థసారథి వితరణ చేశారు. మంగళవారం 520 సిమెంట్ బస్తాలు, ఇసుకను నరసింగపాలెం గ్రామానికి సరఫరా చేశారని టీడీపీ గ్రామ అధ్యక్షుడు పొన్నం కిరణ్ అన్నారు. వీటిని గ్రామ ప్రజలు, పార్టీ నాయకులు సద్వినియోగం చేసుకోవాలని మంత్రి తెలియజేసినట్టు అన్నారు. నరసింగపాలెం గ్రామ ప్రజలు, క్రిస్టియన్స్ సోదరులు మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

వ్యవసాయ కార్మిక మహాసభ జయప్రదం చేయాలి

ఆగిరిపల్లి, అక్టోబరు 14, (ఆంధ్రజ్యోతి) : ఆగిరిపల్లి సుందరయ్య నగర్‌లో ఈనెల 18న జరిగే ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం 6వ మండల మహాసభను జయప్రదం చేయాలని మండల వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి సత్తు కోటేశ్వరరావు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం వ్యవసాయ కార్మిక సంఘం నాయకులతో సమావేశం నిర్వహించి పోస్టర్‌ను ఆవిష్కరించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు జహంగీర్ బాషా, అర్జునరావు, బదరున్నీషా, వర్ధన్, సన్నీ, సాల్మన్, భూషణం బాబు పాల్గొన్నారు.

'అస్తవ్యస్తంగా హైవే విస్తరణ పనులు'

» వాడీవేడిగా కైకలూరు మండల పరిషత్ సమావేశం



మాట్లాడుతున్న కో-ఆప్షన్ సభ్యుడు శ్యాంబాబు

కైకలూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి విస్తరణ పనులు అస్తవ్య స్తంగా ఉన్నాయని ఎక్కడికక్కడే సగభాగం పనులు చేసి వదిలివేయడంతో గోతుల్లో ప్రజలు రాకపోకలు సాగించలేక ఇబ్బందులు పడుతున్నారని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం కైకలూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ అడవి వెంకటకృష్ణ మోహన్ అధ్యక్షతన మండల పరిషత్ సమావేశం వాడీవేడిగా జరిగింది. సమావేశంలో కైకలూరు మండలంలో సింగాపురం నుంచి పల్లెవాడ వరకు జాతీయ రహదారి విస్తరణ పనులు జరుగుతున్నాయని అయితే ఎక్కడికక్కడ గోతులు తవ్వి వదిలేశారని, శింగాపురం గ్రామంలో మంచినీటి పైపులైన్ పూర్తిస్థాయిలో ధ్వంసమైందని తాగునీరు లేక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని కోఆప్షన్ సభ్యుడు సోమల శ్యాంబాబు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. విద్యుత్ అధికారులు సమ్మెలోకి వెళుతున్నారని ఏదైనా మరమ్మతులకు గురైతే ఆక్వారైతులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని దానికి ప్రత్యామ్నాయ ఏర్పాటు చేయాలని దొడ్డిపట్ల సర్పంచ్ చెరుకువాడ బలరామరాజు అన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యల పట్ల అధికారులు అవగాహనతో ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. ఎంపీడీవో కె.రాజాబాబు, వైస్ ఎంపీపీలు మంగినేని రామకృష్ణ, గంగుల వెంకట నరసమ్మ, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

పోలీస్ విధులపై ట్రిపుల్ ఐటీ సిబ్బందికి అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న సీఐ సత్యశ్రీనివాస్

నూజివీడు టౌన్, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి) : ప్రతి ఫిర్యాదును కులంకుషంగా పరిశీలించిన తరువాతే పూర్తిస్థాయిలో కేసులను నమోదు చేయటం జరుగుతుందని, నూజివీడు పట్టణ సీఐ సత్యశ్రీనివాస్ అన్నారు. నూజివీడు పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఆర్జీయూకేటీ సిబ్బందికి పోలీస్ స్టేషన్ పంక్షనింగ్‌లో భాగంగా పోలీసుల విధులు, బాధితుల పట్ల తీసుకుం టున్న చర్యలపై అవగాహన కల్పించారు. సీఐ మాట్లాడుతూ కుటుంబ సంబంధ వ్యవహారాలు, ఇతర నేరా లను ఒకేరీ తిన చూడకూడదన్నారు. కుటుంబ కలహాలను సరిచేసి వారిని కలిపేలా కౌన్సెలింగ్ వంటి చర్యలు ఉంటాయని, ఇతర నేరాలలో నేర నిరూపణపై దృష్టిసారించవలసి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా కేసులను నమోదు చేసేవిధానం, వాటిని పరిష్కరించే అంశాలపై అవగాహన కల్పించారు.

బంధువుల ఇంటికి వెళ్లొచ్చేసరికి దోచేశారు..

ముసునూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వచ్చే సరికి ఇంటి తాళాలు పగులకొట్టి చోరీకి పాల్పడి విలువైన వస్తువులు, నగదును అపహరించిన ఘటన గోగులంపాడు గ్రామంలో జరిగింది. ఎస్ఐ చిరంజీవి తెలిపిన వివరాలివి.. గ్రామానికి చెందిన యలమంచిలి జగదీష్, భార్య నళిని ఈనెల 12వ తేదీ ఉదయం ఇంటికి తాళాలు వేసి నూజివీడులో బంధువుల ఇంటికి వెళ్లారు. 13వ తేదీ సాయంత్రం నూజివీడు నుంచి తిరిగి ఇంటికి వచ్చేసరికి తాళాలు పగులకొట్టి తలుపులు తెరిచి ఉన్నాయి. వెంటనే బెడ్‌రూమ్‌లోకి వెళ్లి చూడగా, బీరువాలోని ఒక కాసు బంగారు చైన్, రెండు వెండి గిన్నెలు, కుంకుమ భరిణి, రూ.8 వేలు నగదు అపహరించినట్టు గుర్తించి ముసునూరు పోలీసులకు బాధితుడు సమాచారం ఇచ్చాడు. చోరీ ప్రాంతానికి క్లూస్ టీమ్‌ను రప్పించి, ఆధారాలు సేకరించారు. బాధితుడు ఫిర్యాదు మేరకు మంగళవారం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

కైకలూరు, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తిపై దాడి చేసి చంపుతానని బెదిరించిన నిందితుడిపై కేసు నమోదు చేశామని కైకలూరు రూరల్ ఎస్ఐ వి.రాంబాబు తెలిపారు. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఆలపాడు గ్రామానికి చెందిన పోసిన శ్రీనివాసరావుకు, అదే గ్రామానికి చెందిన కొప్పుల నాగమల్లేశ్వరరావు మధ్య పశువులను కట్టే చోట ఈనెల నాలుగో తేదీన వివాదం ఏర్పడింది. అదే రోజున పోసిన శ్రీనివాసరావును అడ్డగించి దాడి చేసి గాయపరచడమే కాకుండా చంపుతానని నాగమల్లేశ్వరావు బెదిరించాడు. పెద్దల సమక్షంలో పెట్టినప్పటికి న్యాయం జరగకపోవడంతో శ్రీనివాసరావు మంగళవారం పోలీసులకు ఫిరాదుఉ చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

అయ్యో పాపం..

బైక్ ఢీకొని విరిగిన ఎడమ కాలు

» ఇప్పటికే కుడికాలికి పోలియోతో ఇబ్బంది పడుతున్న మహిళ


విజయవాడ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళ

ముదినేపల్లి, అక్టోబరు 14 (ఆంధ్రజ్యోతి):పోలియో వ్యాధికి గురై కుడికాలు పనిచేయని ఓ మహిళను గుర్తు తెలియని వాహనం ఢీ కొన్న ఘటనలో ఎడమ కాలు విరిగిపోయిన హృదయ విదారక సంఘటన ఇది. పోలీసులు తెలిపిన వివరాలివి.. ముదినేపల్లి మండలం కొత్తపల్లి గ్రామానికి చెందిన పోలియో వ్యాధిగ్రస్తురాలు మద్దాల నామణి శనివారం రాత్రి ఆ గ్రామ సెంటరులో నిలబడి ఉండగా గుర్తుతెలియని వ్యక్తి బైక్‌తో ఢీకొని వెళ్లిపోయాడు. ఈ ఘటనలో ఆమె ఎడమకాలు విరిగి పోయింది. కిందపడి విలవిల్లాడుతున్న ఆమెను వెంటనే 108 వాహనంలో విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి సోమవారం రాత్రి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి ముదినేపల్లి పోలీస్ స్టేషన్ హెచ్‌సీ ఎస్‌వీ రామారావు దర్యాప్తు చేస్తున్నారు.

నేటి నుంచి మాలధారులకు భిక్ష

మండవల్లి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో అతిపెద్ద ఏకశిలా పదునెట్టాంబడి గలిగిన లోకుముడి అయ్యప్పస్వామి ఆలయంలో బుధవారం నుంచి మాలదారులకు భిక్షను ఏర్పాటు చేస్తున్నట్టు దాతలు తెలిపారు. అయ్యప్ప స్వాములు, ఆంజనేయ, శివ, భవాని మాలధారులకు ఆలయం వద్ద నిత్య అన్నదానం దాతల సాయంతో ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ భిక్ష కార్యక్రమం జనవరి వరకు సాగుతుందని వివరించారు. ఈ అవకాశాన్ని మాలాధారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

చీపురుగూడెంలో భిక్ష ప్రారంభం

చాట్రాయి, అక్టోబరు 14(ఆంధ్రజ్యోతి): చీపురుగూడెం రామాలయంలో 40 రోజుల పాటు అయ్యప్ప దీక్షాదారులకు భిక్ష కార్యక్రమం ప్రారంభించారు. సమీప గ్రామాలలోని అయ్యప్ప దీక్షాదారులు భిక్ష కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని నిర్వాహకుడు చీకటి శ్రీనివాసరావు కోరారు.

బాలుడి అదృశ్యం.. కేసు నమోదు

నూజివీడు టౌన్, అక్టోబర్ 14 (ఆంధ్రజ్యోతి): పాఠశాలకు అని వెళ్లిన బాలుడు అదృశ్యమైన ఘటన నూజివీడులో జరిగింది. నూజివీడు మండలం కుక్కలతండా గ్రామానికి చెందిన బరోతు తిరుపతినాయుడు(9) నూజివీడు పట్టణంలోని గొడుగువారిగూడెంలో గల శ్రీనారాయణ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్నాడు. ఈ క్రమంలో అల్పాహారం తీసుకునేందుకు బయటకు వెళతానని వెళ్లి అతడు పాఠశాలకు తిరిగి రాలేదు. బాలుడి తండ్రి బరోతు గోపి నూజివీడు పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.